www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :44 | శుక్రవారం 13.03.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# నా కల నిజం కాబోతోంది

## హైదరాబాద్ కు హాలీవుడ్ రాబోతోంది!

- హైదరాబాద్కు హాలీవుడ్! నెట్ ఫ్లిక్స్ రూపంలో రాక
- తెలంగాణకు రావడంపై సీఎం రేవంత్ హర్షం
- సంస్థ విస్తరణకు అన్నివిధాల సహకరిస్తాం
- ఫ్యూచర్ సిటీలో స్థలం కూడా ఇస్తాం
- ఐలైన్ స్టూడియో ప్రారంభ సభలో సీఎం భరోసా
- నెట్ ఫ్లిక్స్ తో నా కల నిజం కాబోతుంది
- ఐలైన్ స్టూడియోస్ విస్తరణ కు సహకరిస్తం 02
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో కార్యాలయాన్ని హైటెక్ సిటీలో ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని నెట్ ఫ్లిక్స్ కు మా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. బాల్యం నుంచే తనకు సినిమాలపై ఆకస్తి ఉందని తన చిన్నతనం నుంచి ఇప్పటి వరకు సినిమాలో అనేక మార్పులు వచ్చాయన్నారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యనున్నత సాంకేతికతో కూడిన సినిమాలు వచ్చాయని గుర్తు చేశారు. తెలుగు చిత్రపరిశ్రమను చెన్నై నుంచి ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకు వచ్చారన్నారు.

**భూమి ఇచ్చేందుకు రెడీ:**
నెట్ ఫ్లిక్స్ కు ఇది దేశంలోనే రెండో కార్యాలయం అని సీఎం చెప్పారు. మా దృష్టి హాలివుడ్ పైననే అని నేను గతం లోనే చెప్పాను. నెట్ ఫ్లిక్స్ తో నా కల నిజం కాబోతుందన్నారు. ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నాం. మీ విస్తరణకు పెద్ద ఆఫీస్ నిర్మాణానికి కావాల్సిన భూమి ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. నెట్ ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్ ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరుతున్నానన్నారు.

## అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

### సమన్వయంతో సమస్యల పరిష్కారం..

- గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత 03
- పంచాయతీల ఖాతాల్లోకి గణనీయంగా నిధులు జమ
- ఎన్నికల వరకే రాజకీయాలు.. గెలిచిన తర్వాత మనమంతా ప్రజల సేవకులం






## ఇరాన్‌తో ఫలించిన జైశంకర్ దౌత్యం

### హార్ముజ్ నుంచి భారీగా కదిలిన భారత్ నౌకలు

- ఇరాన్తో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ దౌత్యం ఫలించిందని 'రాయిటర్స్' కథనం
- అమెరికా, యూరప్, ఇజ్రాయెల్ నౌకలకు నో
- ధ్రువీకరించని భారత విదేశాంగ శాఖ
- క్లారిటీ ఇవ్వని ఇరాన్ ప్రభుత్వం 05



హమ్మయ్య.. హార్ముజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున భారతీయ చమురు నౌకలు తరలి వస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభం కమ్ముకున్న వేళ భారతదేశానికి ఇరాన్ పచ్చజెండా ఊపింది. కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ జరిపిన దౌత్యం మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఇరాన్‌తో పాటు...

### హార్మూజ్.. దాటేశాం! 02

## యుద్ధం ముగిస్తాం కానీ..

### అమెరికా-ఇజ్రాయెల్‌కు ఇరాన్ 'మూడు' సంచలన షరతులు

- అమెరికా, ఇజ్రాయెల్ ముందు పెట్టిన ఇరాన్
- తక్షణ కాల్పుల విరమణ ప్రకటించాలి
- ఇరాన్పై ఉన్న ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలి
- ఇరాన్పై భవిష్యత్తులో దాడులు చేయబోమని హామీ ఇవ్వాలి 02

## కవితకు సీబీఐ నోటీసులు



### ఎంక్వైరీ కంటిన్యూస్.. లిక్కర్ కేసులో.. మళ్లీ నోటీసులు

- కవిత ఇంటికి సీబీఐ అధికారులు
- హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు
- విచారణకు అనుమతించిన ఢిల్లీ హైకోర్టు
- అందుబాటులో లేని కవిత.. భర్తకు నోటీసులు అందజేత 03

### నోటీసులపై కవిత ఫస్ట్ రియాక్షన్.. 05

## బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ

### స్పీకర్ తీర్పుతో సుప్రీంకోర్టు నిర్ణయం



- త్వరగా తీర్పు కోరుతూ బీఆర్ఎస్ పిటిషన్
- సుప్రీం ఆదేశాలతో నిర్ణయం ప్రకటించిన స్పీకర్
- 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్కు చెందిన వారే
- సుప్రీంకోర్టులో విన్నవించిన స్పీకర్ న్యాయవాది
- విచారణ అవసరం లేదని పిటిషన్ డిస్పోజ్ చేసిన న్యాయస్థానం 02

### ఇక విచారణ అక్కర్లేదు..

## గ్యాస్, పెట్రోల్ కొరత లేదు..

### చమురు కొరత భయం వద్దు



- భారత్కు సరఫరా పూర్తిగా సురక్షితం
- ప్రతిపక్షాలు వదంతులు వ్యాప్తి చేయొద్దు
- హార్ముజ్ సంక్షోభం ఉన్నా ఇబ్బంది ఉండదు
- అవసరానికి మించి సరఫరా ఒప్పందాలున్నాయ్
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి 03

## మోదీ భయపడుతున్నారు

### భారత్ చమురు కొనుగోళ్లు అమెరికా నిర్ణయించాలా?

### దేశానికి ధైర్యం చెప్పి మోదీ భయపడుతున్నారు

ఇంధన భద్రతపై మన విధానమేంటి?
రష్యా నుంచి క్రూడాయిల్ కొనేందుకు అమెరికా పర్మిషన్ ఎందుకు?
యుద్ధ ప్రభావం భారత్ పై తీవ్రంగా ఉంది
హార్ముజ్ మూతతో తీవ్రంగా చమురు సమస్య 03
లోక్ సభలో రాహుల్ గాంధీ ఆగ్రహం
దేశానికి ధైర్యం చెప్పి మోదీ భయపడుతున్నారు
అమెరికాలో అదానిపై కేసు, ఎప్ స్టీన్ ఫైల్స్ అంశాలే కారణం
ప్రధాని లోక్ సభకు వచ్చి సమాధానం చెప్పాలి
లోకసభలో విపక్ష నేత రాహుల్ గాంధీ




## ఆయిల్ రేట్లు ఆకాశంలోకి!



- పెరుగుతున్న వంట నూనె ధరలు
- మిడిల్ ఈస్టో వార్ ఎఫెక్ట్ దిగుమతుల్లో ఆలస్యమే కారణం
- లీటర్ వంట నూనెపై ₹20 పెంపు 02
- సన్ఫ్లవర్, పామాయిల్ పై భారం
- ఇప్పటికే ముడిచమురు, ఎల్ పీజీ, ఎల్ఎన్ దిగుమతుల్లేక అల్లాడిపోతుంటే..
- ఈ సంక్షోభం ఇంకా ముదిరితే భారత్కు భారీ నష్టాలే




అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం భారత్ను ప్రభావితం చేస్తోంది. ఇప్పటికే ముడిచమురు, ఎల్ పీజీ, ఎల్ఎన్ దిగుమతుల్లేక అల్లాడిపోతుంటే.. వంటనూనెల సరఫరాను కూడా మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దెబ్బతీస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం ఇంకా ముదిరితే భారత్కు భారీ నష్టాలేనన్న అంచనాలున్నాయి. వంట నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నెల రోజుల్లో లీటర్కు ₹20 పెరగడంతో సామాన్యులు కలవరపడుతున్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ

- ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో బిగ్ ట్విస్ట్..

**ఢిల్లీ :** తెలంగాణలో గత కొంతకాలంగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం సుదీర్ఘంగా విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ఇవాళ తుది తీర్పును వెలువరిచింది. ఈ కేసు విచారణ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వెల్లడించారు. ఈ మేరకు పిటిషన్లను స్పీకర్ కార్యాలయం పరిష్కరించిందని ధర్మాసనానికి వివరించారు. అయితే, అభిషేక్ మను సింఘ్వీ వాదనలతో జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. స్పీకర్ ఇప్పటికే ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకున్నందున, ఇక ఈ పిటిషన్లపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించిన కోర్టు, విచారణ ముగిసినట్లు ప్రకటించింది. అదేవిధంగా 2 రోజుల్లో స్పీకర్ తన తీర్పు కాపీలు ఫిర్యాదుదారులకు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు పేర్కొంది.

## పెట్రోల్, డీజిల్ లపై కేంద్రం కీలక ప్రకటన..



**ఢిల్లీ :** మధ్యప్రాచ్యంలో యుద్ధం ఎఫెక్ట్ ప్రపంచమంతా కనిపిస్తోంది. భారత్‌పై మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావం పడింది. ఇప్పటికే భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఎల్‌పీజీ సంక్షోభం పెరిగిపోయింది. ఇక పెట్రోల్, డీజిల్ ధరలపై సామాన్యులు భయపడుతున్నారు. ఈ ధరలు రానున్న కొన్ని రోజుల్లో విపరీతంగా పెరుగుతాయనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చింది. ఈ ధరపై ప్రస్తుతం ప్రభావం ఉ ండబోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశీయంగా చమురు ధరలను స్థిరంగా ఉ ంచేందుకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇధనం ఇంధన సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా 'ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్' ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ఇప్పటికే యాక్టివేట్ చేసినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన 'స్ట్రైట్ ఆఫ్ హార్ముజ్' మార్గంలో ఉ ద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వాస్తవానికి గతంలో 'స్ట్రైట్ ఆఫ్ హార్ముజ్' మార్గం గుండా భారత్ 40శాతం చమురును దిగుమితి చేసుకునేది. ఈ మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ వ్యూహాన్ని రూపొందించింది. హార్ముజ్ మార్గం కాకుండా ఇతర ప్రాంతాల నుంచి చమురు దిగుమతులను 60 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దాదాపు 40 దేశాల నుంచి భారత్ చమురును సేకరిస్తోంది. ఈ కొత్త మార్గం ద్వారా చమురు దిగుమతి చేసుకోవడంతో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సంక్షోభం లేదని తెలుస్తోంది. కానీ.. భవిష్యత్తులో యుద్ధం ఇంకా ముదిరితే మాత్రం భారత్‌పై ఎఫెక్ట్ పెద్ద ఎత్తున ఉండబోతోందనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఇక ఎల్పీజీ విషయంలో కేంద్రం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇటీవల జరిగిన గ్యాస్ ధరలు చాలా స్వల్పమని, ఇక మీద భారీ ధరల పెంపు ఏమీ ఉండబోదని ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## హార్ముజ్.. దాటేశాం!

- మన నౌకలు సురక్షితమే
- ఇరాన్ విదేశాంగమంత్రితో కేంద్ర మంత్రి జైశంకర్ చర్చలు
- యుద్ధం మొదలైన తర్వాత హర్ముజ్ దాటిన తొలి భారత నౌక
- సౌదీ నుంచి ముంబై చేరిన ఆయిల్ ట్యాంకర్ షిప్



**ఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధ మేఘాల మధ్య అత్యంత ఉత్కంఠ నెలకొన్న హర్ముజ్ జలసంధిని రెండు భారత వాణిజ్య నౌకలు సురక్షితంగా దాటాయని సమాచారం అందింది. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘీ మధ్య జరిగిన కీలక చర్చల అనంతరం ఈ సానుకూల పరిణామం చోటుచేసు కుందని తెలుస్తోంది. యుద్ధ ఉద్రిక్తతల వల్ల ఈ జలసంధి మీదుగా ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన తరుణంలో భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ ప్రభుత్వం ప్రత్యేక భద్రతా భరోసా కల్పించింది. ఈ దౌత్యపరమైన ముందడుగుతో భారతకు అందే ముడి చమురు, ఎరువుల సరఫరాకు ఎదురైన అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. జైశంకర్ తన ఇరాన్ సహచరుడితో జరిపిన సంప్ర దింపుల్లో భారత ఆర్థిక ప్రయోజనాలను, నౌకల భద్రతను ప్రధానంగా ప్రస్తావించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఇరాన్, భారత నౌకలను తమ ఐఆర్ జీసీ దళాలు లక్ష్యంగా చేసుకో బోవని, అవి జలసంధిని దాటేందుకు పూర్తి సహకారం అంది. స్తామని హామీ ఇచ్చింది.

**హర్ముజ్ దాటిన తొలి నౌక..**

ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలైన తర్వాత హర్ముజ్ జలసంధి దాటి తొలి ముడి చమురు నౌక భారత్కు చేరుకుంది. 'హిందుస్థాన్ టైమ్స్' నివేదిక ప్రకారం.. సౌదీ అరేబియా నుంచి ముడి చమురును తీసుకువస్తున్న 'షెన్లాంగ్ సూయజ్మాక్స్' చమురు ట్యాంకర్ ముంబై పోర్టుకు చేరుకుంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించిన మొదటి భారతీయ నౌక ఇదే. లైబీరియాలో రిజిస్టరైన ఈ ట్యాంకర్ కు ఒక భారతీయుడు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నారు. ఇది మార్చి 1న రాస్ తనూరా చమురు టెర్మినల్లో ముడి చమురును లోడ్ చేసుకుని, రెండు రోజుల తర్వాత తన ప్రయాణాన్నిప్రారంభించింది. మారిటైమ్ ట్రాకింగ్ సంస్థలు 'లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్', 'ట్యాంకర్ ట్రాకర్స్' నివేది కలప్రకారం.. ఈ నౌక మార్చి 8న హర్ముజ్ జలసంధి లోపల ఉన్నప్పుడు చివరిసారిగా దీని సిగ్నల్ నమోదైంది.

**డార్క్ మోడ్లోకి వెళ్లింది..**

హర్ముజ్ జలసంధిలోకి ప్రవేశించిన తర్వాత ట్యాంకర్ కొద్దిసేపు "డార్క్" మోడ్ లోకి వెళ్లింది. అంటే అది తన ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్), ట్రాకింగ్ ట్రాన్స్పాండర్లను నిలిపివేసింది ప్రమాదకర ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు శత్రువుల కంటపడకుండా ఉండేందుకు నౌకలు కొన్నిసార్లు ఇలా చేస్తాయని సమాచారం. ప్రమాదకరమైన మార్గాన్ని దాటిన తర్వాత మార్చి 9న ఈ నౌక తిరిగి ట్రాకింగ్ సిస్టమ్స్ కనిపించింది. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఈ ట్యాంకర్ ముంబై చేరుకుందని పోర్టు అధికారులు తెలిపారు.

## తెలంగాణలో హాఫ్‌డే స్కూల్స్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో పాఠశాలల పనివేళల్లో మార్పులు చేపట్టారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో హాఫ్‌డే స్కూల్స్ అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మార్చి 15 నుంచి ఏప్రిల్ 23, 2026 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు హాఫ్‌డే విధానంలో నడుస్తాయి. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ (ఎయిడెడ్), ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్స్ ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం (మిడ్‌డే మీల్స్) మధ్యాహ్నం 12.30 గంటలకు అందజే స్తారు. ఇక పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి, తద్వారా మార్చి 2026లో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. అలాగే పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్ష జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పనిచేసా-యి. మిగతా రోజుల్లో మాత్రం సాధారణంగా హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

## నా కల నిజం కాబోతోంది

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉ ంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు (గురువారం) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ శ్రీ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**సినిమా రంగంలో అనేక మార్పులు..**

తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు సినిమా రంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు.

తమ దృష్టి హాలివుడ్‌పైననే అని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలో ఉన్న 500 పెద్ద కంపెనీలు తెలంగాణకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని భరోసా కల్పించారు. తెలంగాణ అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆయిల్ రేట్లు ఆకాశంలోకి!

**ఢిల్లీ:** వాహనాల ఇంధన సమస్యతో సతమతవ-ువుతున్న భారత్కు.. వంటనూనెల తలనొప్పి మొదలైంది. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ దాడులు, ప్రతిదాడుల ప్రభావం ముడి చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్ సరఫరానే గాక.. సోయా, సన్ఫ్లవర్ పామాయిల్ దిగుమతులపై కనిపిస్తున్నది. ప్రస్తుతం దేశీయ వంటనూనెల అవస రాలు మూడింటా దాదాపు రెండు వంతులు (66 శాతం) దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. దేశ, విదేశీ విపణులలో నెలకొన్న పరిణామాల దృష్ట్యా రిటైల్ మార్కెట్లో వంటనూనెల ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. దీంతో సహజంగానే కొనుగోలు పెరుగుతున్నది. ఫలితంగా డిమాండ్కు తగ్గ సరఫరా కోసం వ్యాపారులు విదేశాల నుంచి మరింతగా వంటనూనెల్ని దిగుమతి చేసుకోవాల్సి వస-్తున్నది. అయితే.. అసలే భారమైన సరుకు రవాణా ఖర్చుల నడుమ కొత్తగా కొంటున్న వంటనూనెలు సకాలంలో చేతికందక డీలర్లు అవస్థలు పడాల్సి వస్తున్నది. మిడిల్ ఈస్ట్ ఉ ద్రిక్తతలతో కార్గో షిప్ల రాకపోకలు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. నడుస్తున్న ఆ కొద్ది నౌకలూ చుట్టూ తిరిగి వస్తుండటంతో ఆలస్యంగా గమ్యం చేరుతున్నాయి.

**వంట నూనెల దిగుమతిలో భారత్ టాప్**

ప్రపంచంలోనే వంటనూనెల దిగుమతిలో భారత్ అగ్రగామిగా ఉన్నది. అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయా నూనెను దేశీయ దిగుమతిదారులు ప్రధానంగా కొంటున్నారు. అలాగే రష్యా, ఉక్రెయిన్ నుంచి సన్ఫ్లవర్ ఆయిల్ పెద్ద మొత్తంలో భారత్కు వస్తున్నది. ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియా నుంచి పామాయిల్ను కొంటున్నాం. అయితే.. సాధారణంగా అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి భారత్కు సముద్ర మార్గం ద్వారా వంటనూనెల దిగుమతులు రావాలంటే 6 వారాలపైనే పడుతుంది. రష్యా, ఉక్రెయిన్ నుంచి నల్లసముద్రం మీదుగా సరుకు చేరాలంటే 34 వారాల సమయం తీసుకుంటున్నది. ఆసియా దేశాల నుంచే పామాయిల్ దిగుమతులు అవుతున్నా ఇంచుమించుగా వారం సమయం అవుతున్నది. కానీ గల్ఫ్ దేశాలు అగ్ని గుండంలా మారడంతో ఈ వంటనూనెల దిగుమతి ఆలస్యమవుతోంది.

**పెట్రోల్, డీజిల్ ధరలపైనా ప్రభావం..**

పశ్చిమాసియా సంక్షోభం.. భారత్లో ద్రవ్యోల్బణ భయాలకు దారితీస్తున్నది. ఇప్పటికే వంటగ్యాస్ ధర సిలిండర్కు ₹60 పెరిగింది. త్వరలో పెట్రోల్, డీజిల్ తోపాటు ఇతర ఇంధన ధరలూ పెరుగుతాయన్న అంచనాలు ఉన్నాయి. వంటనూనెల ధరలూ విజృంభిస్తు న్నాయి. దీంతో అటు రిటైల్, ఇటు హోల్సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు భారీగానే నమోదు కావచ్చన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదే జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను పెంచే వీలుందన్న అభి ప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు పెరిగి రుణ లభ్యత భారం కావచ్చని, ఇది ఆయా రంగాల వృద్ధిని దెబ్బతీయగలదన్న ఆందో ళనలు సర్వత్రా వ్యక్తమవుతు న్నాయి. చివరకు దేశ జీడీపీ వృద్ధి క్షీణించే ప్రమాదం ఉ ందని పరిశీలకులు అంటున్నారు. వంట నూనెల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నెల రోజుల్లో లీటర్కు సుమా-రు ₹20 పెరిగి సామాన్యులను కలవరపెడుతోంది. జనవరి నుంచి విదేశాల దిగమతులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాపారులు అంటున్నారు. అందులో ఇరాన్ వార్ నేపథ్యంలో సరుకుల రవాణా ఆలస్యంతో లోకల్గా డిమాండ్ పెరుగుతోంది. దీంతో వంట నూనెల ధరలు పెరుగుతుండడం కనిపిస్తోంది. లీటర్ పొద్దుతిరుగుడు నూనె రిటైల్ ధర ₹155 ఉండగా తాజాగా ₹175కు చేరింది. పామాయిల్ ధర ₹140 నుంచి ₹160కి పెరిగింది. ఏపీ, తెలంగాణలో పొద్దు తిరుగుడు, పామాయిల్ వినియో గమే ఎక్కువగా ఉ ంటుంది. ఇందులో సన్ ఫ్లవర్ నూనె అధికంగా వినియోగిస్తుంటారు.

**నౌకలపై ఇరాన్ దాడులు..**

ముఖ్యంగా రష్యా, ఉక్రెయిన్ నుంచి ఎర్ర సముద్రం మీదుగా భారత్కు రావాల్సిన సన్ఫ్లవర్ ఆయిల్... ఆఫ్రికా చుట్టూ తిరిగి వస్తున్నది. అమెరికాకు అండగా ఉంటున్నారని పొరుగు దేశాలే లక్ష్యంగా ఇరాన్ బాంబుల వర్షం కురిపిస్తున్నది. తమ భూభాగం లోని హర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. ఈ మార్గంలో వెళ్లే నౌకలపై దాడులు చేస్తున్నది. దీంతో దూ-రమైనా సురక్షిత మార్గాల్లోనే నౌకలు వెళ్లాల్సి వస్తున్నది. ఫలితంగా నౌకల ఇంధన ఖర-్చుతోపాటు సరుకులపై బీమా వ్యయం కూడా పెరిగిపోతున్నది. అలాగే.. సరుకు కనీసం 10 రోజులు ఆలస్యంగా వస్తుండ టంతో వ్యాపారులపై టన్నుకు 20 డాలర్లు, ఆపై భారం పడుతున్నది. తెచ్చిన వాణిజ్య రుణాలకు వడ్డీ భారం కూడా పెరిగి పోతున్నది.

## యుద్ధం ముగిస్తాం కానీ..

### అమెరికా-ఇజ్రాయెల్‌కు ఇరాన్ 'మూడు' సంచలన షరతులు



**ఇరాన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుతున్న వేళ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంచలన ప్రకటన చే శారు. అమెరికా-ఇజ్రాయెల్ దళాలతో సాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలంటే మూడు కీలక షరతులను ఆయన తెరపైకి తెచ్చారు. ఈ డిమాండ్లకు అంగీకరిస్తేనే ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్ముజ్ జలసంధిని తక్షణమే తెరుస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు పెజెష్కియాన్ తన సోషల్ మీడియా వేదికగా అంతర్జాతీయ సమాజానికి ఇరాన్ పక్షాన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు.

**ఇరాన్ విధించిన 3 ప్రధాన షరతులు ఇవే..**

అంతర్జాతీయ వేదికలపై ఇరాన్ సహజ సిద్ధమైన హక్కులను అధికారికంగా గుర్తించాలని తెలిపారు. ప్రస్తుత యుద్ధం కారణంగా ఇరాన్‌కు జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇరాన్ సార్వభౌమాధికారంపై మళ్లీ ఎటువంటి దాడులు చేయబోమని అంతర్జాతీయంగా గ్యారెంటీ (హామీ) ఇవ్వాలని వెల్లడించారు.

**రగులుతున్న పశ్చిమాసియా..**

గత ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై ఆకస్మిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా ఖమేనీ సహా పలువురు అగ్రశ్రేణి నాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన ఇరాన్.. ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా హర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లను పేల్చివేయడంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలపై ప్రభావం పడుతోంది.

## బడ్జెట్‌పై కసరత్తు ముమ్మరం..

### హోం, ఐటీ శాఖలపై భట్టి విక్రమార్క సమీక్ష



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అసెంబ్లీ సమావేశాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌పై కసరత్తును ముమ్మరం చేస్తోంది. శాఖల వారిగా ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన మరియు ప్రజా భద్రతకు సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు భట్టి వెల్లడించారు. ఈ సమావేశంలో హోం శాఖ కార్యదర్శి సి.వి. ఆనంద్, ఏడీజీ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, మల్కాజ్‌గిరి సీపీ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఐటీ శాఖతోనూ..**

హోంశాఖ సమీక్షా అనంతరం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల శాఖల ఉ న్నతాధికారులతో భట్టి సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధింత శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఐటీ స్పెషల్ సెక్రటరీ భవేష్ మిశ్రా, టీజీఐఐసి ఎండి శశాంక్, ఇండస్ట్రీస్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ఇది అర్బన్ నక్సల్స్ రిపోర్ట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన సిఫార్సులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వ-రః..' అంటూ గురువులకు గౌరవం ఇవ్వాలని మన సంస్కృతి మనకు నేర్పుతుంటే తెలంగాణ విద్యా కమిషన్ మాత్రం తెలంగాణ ఉపాధ్యాయ సమాజాన్ని అవమానించే సిఫార్సులు చేసిందని మండిపడ్డారు. మన సమాజంలో గురువుల పాత్ర, మన నాగరిక విలువలకు గౌరవం తెలియని అర్బన్ నక్సల్స్ తయారు చేసిన నివేదికల వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ నివేదికను తిరస్కరించి తెలంగాణ ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని లేదా ఈ సిఫార్సులు సరైనవే అని ప్రభుత్వం భావిస్తే వాటిని అమలు చేసి ఎన్నికలు వెళ్లాలని డిమాండ్ చేశారు. అప్పుడు ఉపాధ్యాయులు తమ తీర్పు ఏమిటో చెబుతారన్నారు. గురువులను గౌరవించుకోవాల్సిన చోట ఉపాధ్యాయుల జీతాలు తగ్గించాలి, పదోన్నతులు నిలిపివేయాలి, ఉపాధ్యాయులను ఉద్యోగాల నుంచి తొలగించాలని సిఫార్సు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ఇవాళ పోస్టు చేశారు.

**విద్యాకమిషన్ నివేదికపై విమర్శలు:**

కాగా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యాకమిషన్ తన అధ్యయనం పూర్తి చేసి ఇటీవలే తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో ఉపాధ్యాయుల జీతభత్యాల క్రమబద్ధీకరణ అంశపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.


ఈ నేపథ్యంలో ఉధ్యాయ సంఘాలు, ప్రతిపక్షాలు ఈ కమిషన్ ప్రతిపాదనలపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ విమర్శలు చేశాయి. ఈ వివాదం చిలికి చికిలి గాలివానలా మారే సూచనలు కనిపించడంతో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు సైతం విద్యాకమిషన్ రిపోర్టుపై వస్తున్న ఆరోపణలపై స్పందించారు. తెలంగాణలో ప్రభుత్వ టీచర్ల జీతాల విషయంలో వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు.



# కవితకు సీబీఐ నోటీసులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సీబీఐ అధికారులు ఈరోజు(గురువారం) నోటీసులు జారీ చేశారు. ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి ఆమెకు సమన్లు జారీ చేశారు. కవితతో పాటు అరుణ్ రామచంద్ర, అభిషేక్ బోయిన్‌పల్లి, శరత్ రెడ్డి, మాజీ ఎంపీ మంగుంట శ్రీనివాస్ రెడ్డిలకు సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇటీవల ఇదే కేసులో ఢిల్లీ హౌస్ రెవెన్యూ కోర్టు కవితకు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ, ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టులో పిటిషన్ దాఖలైన నేపథ్యంలోనే సీబీఐ అధికారులు మళ్లీ రంగంలోకి దిగడం గమనార్హం.కవిత అనారోగ్యంతో ఉండటంతో ఆమె భర్త అనిల్‌కి అందజేశారు. ఈ నెల 16వ తేదీన ఢిల్లీ హైకోర్టులో విచారణ ఉందని సీబీఐ అధికారులు తెలిపారు. ఇప్పటికే ట్రయల్ కోర్ట్ ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈనోటీసులపై కవిత అనుచరులు తీవ్రంగా స్పందించారు. ఒకసారి కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాత మళ్లీ నోటీసులు ఇవ్వడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపిస్తున్నారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, నిజం గెలుస్తుందని కవిత మొదటి నుంచి చెబుతున్నారని అన్నారు. ఈ నోటీసులకు కూడా చట్టబద్ధంగానే సమాధానం ఇస్తామని కవిత అనుచరులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసు ఢిల్లీ హైకోర్టు పరిధిలో ఉన్నందున, మార్చి 16వ తేదీన జరిగే తదుపరి విచారణ అత్యంత కీలకం కానుంది. క్లీన్‌చిట్ నిలబడుతుందా లేదా మళ్లీ విచారణ ఎదు-ర్కోవాల్సి ఉంటుందా అనేది వేచి చూడాలి.

# మోదీ భయపడుతున్నారు



**ఢిల్లీ :** ప్రజలకు ధైర్యం చెప్పి ప్రధాని మోదీ భయపడుతున్నారని లోక్సభలో విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో గ్యాస్ కొరత వల్ల ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ప్రధాని ధైర్యం చెప్పడానికే పరిమితమ య్యారని విమర్శిచారు. పార్లమెంట్ ఆవ రణంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని అసలైన సమస్యలపై పార్లమెంటులో మా ట్లాడటానికి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. అమెరికాలో అదానీపై నమోదైన కేసులు, ఇటీవల బయటకు వచ్చిన ఎప్స్టీన్ ఫైల్స్ అంశాలే ప్రధాని భయానికి కారణ మని రాహుల్ ఆరోపించారు. దేశం ఇన్ని సమస్యలను ఎదుర్కొంటున్నా ప్రధాని ఎందుకు లోక్సభకు వచ్చి సమాధానం చెప్పడం లేదని రాహుల్ ప్రశ్నించారు. ఈ భయం కారణంగానే ప్రధాని సభ ముఖం చూడటం లేదని విమర్శించారు.

**భారత్ చమురు కొనుగోళ్లు అమెరికా నిర్ణయించాలా?**

భారత్.. చమురు కొనుగోళ్లను అమెరికా నిర్ణయించాలా..? రష్యా నుంచి క్రూడాయిల్ కొనేందుకు యూఎస్ పర్మిషన్ ఎందుకు తీ సుకోవాల్సి వచ్చింది.. అంటూ తనదైన శైలిలో నిలదీశారు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఇవాళ లోక్ సభలో చమురు సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇంధన భద్రతపై మన విధానమేంటో చెప్పాలని నిలదీశారు. ఒక దేశానికి ఇంధన భద్రతే పునాది అని పే ర్కొన్నారు. భారతదేశం వంటి పెద్ద దేశం తన విదేశాంగ, వాణిజ్య సంబంధాలపై స్వతంత్రని ర్ణయాలు తీసుకోవాల్సిందిగా స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైందని, దీని ప్రభావం ప్రపంచవ్యా ప్తంగా తీవ్రంగా ఉండబోతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 శాతం వెళ్లే హోర్ముజ్ జలసంధి మూసివేయబడిందని పేర్కొంటూ ఇది భారత్కు పెద్ద ముప్పుగా మారవచ్చని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కష్టాలు ఇక్కడితో ఆగవని, అవి ఇంకా పెరు గుతాయన్నారు. భారత్కు వచ్చే చమురు, సహజ వాయువులో ఎక్కువ భాగం ఈ మార్గం ద్వారానే వస్తుందని గుర్తుచేశారు. ఇప్పటికే గ్యాస్ కొరతపై భయాందోళనలు మొదల య్యాయని, కొన్ని ప్రాంతాల్లో రెస్టారెంట్లు మై తపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం ముందుగా ప్రణాళికలు రూపొందించడంలో విఫలం అయ్యిందన్నారు. దేశ ప్రజలు గ్యాస్ కోసం నానా అవస్థలు పడుతుంటే.. ప్రధాని మాత్రం తన మిత్రుల ప్రయోజనాలను కాపా డటంలోనే బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ లోపల, బయట ఈ అంశంపై పో రాటాన్ని ఉధృతం చేస్తామని రాహుల్ గాంధీ స్పష్టం

చేశారు. ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి, గ్యాస్ సరఫరాను ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల వరకే రాజకీయాలని.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరూ ప్రజలకు మంచి చేసే ప్రజా ప్రతినిధ-ులేనని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈరోజు (గురువారం) ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

**ఆ బాధ్యత మనపై ఉంది..**

తమ ప్రభుత్వం 6 తేదీ నుంచి 99 రోజుల పాటు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక రూపొందించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్‌గా ఆ వ్యక్తి ఉంటే గ్రామం అభివృద్ధి జరిగిందని చెప్పుకునేలా పని చేయాలని దిశానిర్దేశం చేశా-రు. అధికారులు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు వారు ఉన్నప్పుడు మంచి పనులు జరిగాయని ప్రజలు చెప్పుకోవాలన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మనపై ఉందని చెప్పుకొచ్చారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. మార్చి 31వ తేదీ లోపు అభివృద్ధి పనుల కోసం నిధులు మళ్లీ వస్తాయని.. వచ్చిన నిధులను ప్రణాళికబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడేలాగా వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు.

**నిధులను సద్వినియోగం చేసుకోవాలి..**

సర్పంచ్‌లకు మునుపే ట్రైనింగ్ ఇచ్చారని, వారి విధులు ఏంటి, మీరు ఎలా పని చేయాలనే విషయాలు ఇప్పటికే అర్థమై ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వేసవిలో తాగునీరు సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఆదేశించారు. ఏ గ్రామ పంచాయతీకి అత్యధిక నిధులు వచ్చాయో ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యం అయ్యేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# కవిత చేసిన ట్వీట్ మర్చిపోయావా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించడం సరికాదని అన్నారు. ఒకసారి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి కేసీఆర్‌ను అడిగితే అసలు విషయం కేటీఆర్‌కు తెలుస్తుందని కౌంటర్ ఇచ్చారు. కొత్తగా వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో ఏకపాత్రాభినయం చేయాలని పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం మొదలు పెట్టిందే కేసీఆర్ అని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలని చూశారని అన్నారు. పార్టీ ఫిరాయింపులు ఏ స్థాయిలో చేయవచ్చో కేసీఆర్ నిరూపించారని తెలిపారు. అవసరం అయితే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఎట్లా ఇవ్వవచ్చో కేసీఆర్ ర-ుజువు చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు.

**అందుకే స్పీకర్‌ను టార్గెట్ చేశారు?**

స్పీకర్ దళితుడు కాబట్టే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ తప్పుబడుతోంది. సైకిల్ గుర్తుపై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి, హస్తం గుర్తుపై గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి మంత్రి పదవి ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్ నీతులు చెబుతుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. రాహుల్ గాంధీని తిట్టాలన్న అజెండాతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. ప్రజలు నమ్మడం లేదు, ఓట్లు వేయడం లేదని కేటీఆర్ జిమ్‌కు వెళ్తున్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ పార్టీకి అక్కసు ఎందుకు' అని చామల కిరణ్ ప్రశ్నించారు.

**అమిత్ షా ఒక స్టేట్మెంట్ - బండి సంజయ్ ఒక స్టేట్మెంట్..**

స్పీకర్ నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. స్పీకర్ అధికారాలపై కోర్టులు జోక్యం చేసుకోలేవని నిన్ననే లోక్‌సభలో అమిత్ షా మాట్లాడారు. స్పీకర్ అధికారాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఒక స్టేట్ మెంట్ సహాయ మంత్రి బండి సంజయ్ మరో స్టేట్ మెంట్ ఇస్తున్నారు. స్పీకర్ గురించి బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే మాట్లాడుతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని పార్లమెంట్ ఎన్నికల్లో తేలిపోయింది. కాంగ్రెస్ పాలనను తప్పుదోవ పట్టించడానికి కేటీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ఎందుకు బీజేపీ అడ్డుకోలేదు. కేటీఆర్ సొంత చెల్లి కర్మ రిటన్స్ అని ట్వీట్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇంటర్నల్ ఒప్పందం తెలంగాణ ప్రజలకు తెలుసు. కేటీఆర్ మాట్లాడితే గురివింద గింజ సిగ్గు పడుతుంది. బండి సంజయ్ మీ బాస్ అమిత్ షా గోవా, మహారాష్ట్ర, కర్ణాటకలో ఎలాంటి ఫిరాయింపులు చేశారో గుర్తు లేదా..? అని చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం





**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** రైతులు తక్కువ ఖర-్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉ ద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ.4.9 లక్షల విలువ గల 20 హెచ్‌పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూముందుంటుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు, డీఆర్‌డీఓ జ్యోతి తదితర జిల్లా అధికారులు, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

**అవగాహన పెంచుకుని.. అంకితభావంతో పని చేయండి**

ప్రజా ప్రతినిధులు వారి హక్కులను ,బాధ్యతలను, చట్టాలను తెలుసుకొని తమ ప్రాంత ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. గురువారం కందిలో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ,జిల్లాలోని సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ఒక మహత్తర కార్యక్రమాన్ని తీసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి సాహసం చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పది అంశాలపై గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ ,జిల్లా ,రాష్ట్ర స్థాయిల వరకు ఏ విధంగా ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిధుల సమీకరణ, ప్రజా ప్రతినిధుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి ప్రజా ప్రతినిధి అన్ని అంశాలపై అవగాహనను పెంచుకొని అంకితభావంతో తమ ప్రాంతంలో గెలిపించిన ప్రజలకు, పార్టీలకు అతీతంగా సేవలను అందించాలని పిలుపునిచ్చారు .కనీస సౌకర్యాలైన రోడ్లు ,విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజ్ వంటి అంశాలకు ముందుగా ప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.

నా ప్రాంతానికి ఎంత చేసిన రుణం తీర్చుకోలేను

ప్రతి ఒక్కరికి తన ప్రాంతంపై ప్రత్యేక అభిమానం ఉంటుందని, తనకు కూడా అందోల్ నియోజకవర్గ ప్రజల పట్ల ఒక ప్రత్యేక అభిమానం ఉంటుందన్నారు. వారికి తాను ఎంత చేసిన వారి రుణం తీర్చుకోలేనని, అదేవిధంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా వారి ప్రాంతానికి సేవ చేసే అవకాశం వచ్చిందని ,ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

**మహిళా శక్తిగా రూపాంతరం చెందిన తెలంగాణ రాష్ట్రం**

తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అత్యంత శక్తివంతంగా మారారని అన్ని రంగాలలో వారు తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధులుగా కూడా వారి సత్తాను చాటుతున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా మహిళా ప్రజా ప్రతినిధులతో మాట్లాడి వారి ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేస్తారు అంటూ అడిగి తెలుసుకున్నారు. వారికి తన సహకారం కూడా ఉంటుందని హామీ ఇచ్చారు.

**శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధిలో అమలుపరచాలి సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్య**

99 రోజుల పాటు కొనసాగనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనేక అంశాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్నామని ఈ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గ్రామ, మున్సిపల్ అభివృద్ధిలో అమలు పరచాలని కలెక్టర్ అన్నారు.

**ప్లాస్టిక్ ను పారద్రోలి పర్యావరణాన్ని కాపాడుదాం : టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

ప్లాస్టిక్కు పారద్రోలి పర్యావరణాన్ని కాపాడాలని అందుకు ప్రతి ప్రజా ప్రతినిధులు కంకణం కట్టుకోవాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా పనిచేయాలని, నిధులను సమీకరించి అభివృద్ధి పనులను మొదలు పెట్టాలని అన్నారు. ప్రధానంగా పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్లాస్టిక్ ను పారద్రోలి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

**ప్రతి ప్రజా ప్రతినిధికి పది లక్షల ఇన్సూరెన్స్..ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

నూతనంగా గెలుపొందిన ప్రజా ప్రతినిధులందరికీ తన సొంత నిధులతో పది లక్షల వరకు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రకటించారు. అవగాహన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అభివృద్ధిని చేసుకోవాలని అన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం డంప్ యార్డులకు ఎస్ టి పి ప్లాంట్లకు స్థలాలను కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి 15, 16 ఆర్థిక సంఘం ద్వారా ఎనిమిది లక్షల కోట్లు నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు ,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్, పెట్రోల్ కొరత లేదు..

**ఢిల్లీ :** ఇరాన్ యుద్ధం కారణంగా, దేశంలో గ్యాస్, పెట్రోల్ సంక్షోభంపై కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత లేదని స్పష్టం చేశారు. గృహ వినియోగదారులకు ఎలాంటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కమర్షియల్ గ్యాస్‌ను బ్లాక్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ముందుగా సాధారణ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. స్కూల్స్, హాస్పిటల్స్‌కు ఎలాంటి అవాంతరాలు లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. మిగతా దేశాలతో పోలిస్తే చమురు విషయంలో భారత్ స్థానం పటిష్టంగా ఉందని స్పష్టం చేశారు.గల్ఫ్ దేశాల నుంచి 60 శాతం ఎల్పీజీని దిగుమతి చేసుకుంటున్నామని, దేశంలో డిజిల్, పెట్రోల్ కొరత లేదని చెప్పారు .గల్ఫ్ దేశాలకు బదులుగా నార్వే, కెనడా నుంచి దిగుమతి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు చెప్పారు. దేశంలోని అన్ని రిఫైనరీలు అధిక సామర్థ్యంలో పని చేస్తున్నాయని చెప్పారు. హార్ముజ్ జలసంధి నుంచి కాకుండా వేరే ప్రాంతాల నుంచి ముడి చమురు దిగుమతులు దాదాపుగా 70 శాతానికి పెరిగాయని వెల్లడించారు. భారతదేశం చమురు అవసరాల కోసం 2006-07లో 27 దేశాలపై ఆధారపడితే, ఇప్పుడు ఇది 40 దేశాలకు పెరిగిందని కేంద్రమంత్రి చెప్పా-రు.ఆధునిక ఇంధన చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదని, భారతదేశ ముడి చమురు స్థానం సురక్షితంగా ఉందని, సంక్షోభానికి ముందు భారత ముడి చమురు దిగుమతుల్లో 45 శాతం మాత్రమే హార్ముజ్ ద్వారా రవాణా జరిగిందని, సంక్షోభ సమ-యంలో కూడా ప్రధాని మోదీ దౌత్యం వల్ల భారతదేశానికి హర్ముజ్ జలసంధిని ఇరాన్ అనుమతించిందని సభలో తెలిపారు.

# మరో 15 ఏళ్లు మేమే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో మరో పదిహేనేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ప్రజాపాలన-ప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోమటిరెడ్డి పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ప్రజా పాలన మొదలైంది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఉచిత కరెంటు బిల్లు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. సర్పంచులు గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన తప్ప ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదు. గ్రామ సర్పంచులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతతో పని చేయాలి.

ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలి. గ్రామాలలో ఎలాంటి సమస్య ఉన్న సర్పంచులు నేరుగా కలెక్టర్‌ను గానీ నన్ను గానీ కలవచ్చు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుంది' అని మంత్రి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.

# యూరియా కోసం కేంద్రానికి లేఖ



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు.తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జూలై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్టంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల అవసరమవుతుందని చెప్పారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.

సంపాదకీయం

# కమర్షియల్ సిలిండర్ ధరకు రెక్కలు

హైదరాబాద్ మహా నగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. ప్యారడైజ్ వద్ద గల నవరతన్ ఎంటర్ప్రైజెస్ (ఇండేన్ గ్యాస్) ఏజెన్సీలో 26వేల డొమెస్టిక్ కనెక్షన్లు, 600 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. గతంలో రోజుకు 500 సిలిండర్లను సప్లయ్ చేస్తుండగా బుధవారం 200 మాత్రమే సప్లయ్ చేశారు. బుధవారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి.

**మూత పడుతున్న హోటల్స్**

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. మహమ్మద్‌గూడాలో ఓ హోటల్లో సిలిండర్ కొరతతో మూసేస్తున్నట్లు యజమాని ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. పద్మారావునగర్‌లోని టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకుడు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని బొల్లారంలోని స్ట్రీట్ టిఫన్ సెంటర్ యజమాని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో గ్యాస్ కొరతతో హోటల్ మాస్టర్స్ బిర్యానీ మూతపడింది.

**బావర్చి హోటల్ మూసివేత**

ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది.

**డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం**

పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు.

**దుర్వినియోగం చేస్తే చర్యలు**

వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**జిల్లాలో సిలిండర్ల వివరాలు**

పౌరసరఫరాల శాఖ అధికారుల లెక్క ప్రకారం జిల్లాలో ఐఓసీ, హెచ్‌పీ, బీపీసీఎల్‌కు చెందిన67 ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లు 18,61,931, వాణిజ్య సిలిండర్లు 19,149 ఉన్నాయి.

**నిలిచిన బుకింగ్ సేవలు**

గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.

**రూ. 5 భోజనానికి ఇబ్బంది ఉండదు**

గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు.

**ప్రత్యామ్నాయ మార్గాల వెతుకులాట**

సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు.

**హాస్టళ్ల నిర్వహణపై యజమానుల మల్లగుల్లాలు**

విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్(పీజీ) హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. నిర్వాహకుల నెత్తిన గ్యాస్ బండ పడింది. పశ్చిమాసియాలోని యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు.

**గ్యాస్ కొరత నష్టాల్లోకి నెడుతుంది**

మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. గతవారంలో అమీర్‌పేట బాపూనగర్ చుట్టుపక్కల 40కుపైగా హాస్టళ్లు మూతపడ్డాయి. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం.



# బట్టీల వెనుక బానిస బతుకులు..

ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు ఏజెంట్ల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి గుంపులుగా వస్తున్న వలస కార్మికులు, వారి కుటుంబాల వివరాలు అధికారికంగా ఎక్కడా నమోదు కావడం లేదు. నిబంధనల ప్రకారం కార్మికులు రాగానే వారి ఆధార్ తదితర వివరాలను కార్మిక, పోలీస్ శాఖలకు అందించాలి. కానీ, బట్టీల నిర్వాహకులు ఈ ప్రక్రియను పూర్తిగా విస్మరిస్తున్నారు.



**కొత్త నిబంధనలతో నైనా కళ్లెం పడేనా..?**

ఒకవైపు కార్మికుల దోపిడీ ఇలా కొనసాగుతుండగా, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ హైకోర్టు ఆదేశాల మేరకు జీఓ నంబర్ 80 ని విడుదల చేసింది. వాయు కాలుష్య నియంత్రణకు కఠిన మార్గదర్శకాలను అమలులోకి తెచ్చింది.



జిల్లాలో ఇటుక బట్టీల దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒకవైపు వలస కార్మికుల శ్రమను నిలువునా దోచుకుంటున్న నిర్వాహకులు, మరోవైపు పర్యావరణ నిబంధనలకు పాతరేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 కి పైగా చిన్న, మధ్య తరహా ఇటుక బట్టీలు కొనసాగుతుండగా వీటిలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని స్థానికులు, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటుక బట్టీల ఏర్పాటుపై కఠిన మార్గదర్శకాలతో కొత్త జీవోను జారీ చేసింది.

**వలస కార్మికుల డేటా ఏదీ?**

ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు ఏజెంట్ల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి గుంపులుగా వస్తున్న వలస కార్మికులు, వారి కుటుంబాల వివరాలు అధికారికంగా ఎక్కడా నమోదు కావడం లేదు. నిబంధనల ప్రకారం కార్మికులు రాగానే వారి ఆధార్ తదితర వివరాలను కార్మిక, పోలీస్ శాఖలకు అందించాలి. కానీ, బట్టీల నిర్వాహకులు ఈ ప్రక్రియను పూర్తిగా విస్మరిస్తున్నారు.

**కనీస సౌకర్యాలు శూన్యం.. పనిగంటల్లో ఉల్లంఘన**

బట్టీల వద్ద కార్మికులకు కనీస జీవన సదుపాయాలు కరువయ్యాయి. సురక్షిత తాగునీరు లేక వ్యవసాయ బావులు, బోరు బావిలో నీటినే తాగుతున్నారు. పారిశుధ్యం లేని తాత్కాలిక గుడిసెల్లోనే బతుకీడుస్తున్నారు. చట్ట ప్రకారం రోజుకు 8 గంటలు మాత్రమే పని చేయించాల్సి ఉండగా.. నిర్వాహకులు అదనపు గంటలు పని చేయించుకుంటూ, కనీస వేతనాలు కూడా చెల్లించకుండా తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు.

**బాలల చేతిలో ఇటుకలు**

కార్మికుల పిల్లల కోసం ట్యూటర్‌ను నియమించి తాత్కాలిక పాఠశాలలు (వర్క్ సైట్ స్కూల్స్) ఏర్పాటు చేయాలనే నిబంధన కేవలం కాగితాలకే పరిమితమైంది. అధికారులు తనిఖీకి వస్తున్నారంటే బడులు తెరిచి, వెళ్లగానే మూసివేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పసి చేతులు పుస్తకాలకు బదులు ఇటుకలు మోస్తున్నాయి. కార్మిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి ఈ ఆగడాలు నిరాటంకంగా సాగుతున్నాయి. కార్మికుల హక్కులను కాపాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**కొత్త నిబంధనలతో నైనా కళ్లెం పడేనా..?**

ఒకవైపు కార్మికుల దోపిడీ ఇలా కొనసాగుతుండగా, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ హైకోర్టు ఆదేశాల మేరకు జీఓ నంబర్ 80 ని విడుదల చేసింది. వాయు కాలుష్య నియంత్రణకు కఠిన మార్గదర్శకాలను అమలులోకి తెచ్చింది.

**ఎన్ఓసీ తప్పనిసరి**

ఇటుక బట్టీ ఏర్పాటుకు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ లేదా జిల్లా పరిషత్‌ల నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' కచ్చితంగా తీసుకోవాలి. ఈ నిబంధనలు పాటించే వారికే జిల్లా పరిశ్రమల కేంద్రాలు అనుమతులు ఇస్తాయి. కిలోమీటరు దూరం బట్టీ స్థలం ఎట్టి పరిస్థితుల్లోనూ నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు 1 కిలోమీటర్ లోపు ఉండకూడదు. వ్యవసాయ భూముల నుంచి 50 మీటర్లు, నదీ తీరాల నుంచి 100 మీటర్లు, జాతీయ/రాష్ట్ర రహదారుల నుంచి 200 మీటర్లు, గ్రామ రోడ్ల నుంచి 25 మీటర్ల దూరం పాటించాలి. వ్యవసాయానికి ఇబ్బంది కలగకూడదు. కాలుష్య నియంత్రణ పాటించాలి. దుమ్ము లేవకుండా బట్టీ చుట్టూ రోడ్డుపై ఇటుక ముక్కలతో పూత పోయాలి. ఉత్పత్తి అయ్యే బూడిదను సురక్షితంగా నిర్వీర్యం చేయాలి. ప్రభుత్వం జారీ చేసిన ఈ కొత్త ఆదేశాల అమలును ప్రతి జిల్లాలో కలెక్టర్లు పర్యవేక్షించనున్నారు. నిబంధనలు ఉల్లంఘించే బట్టీలపై కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు కఠిన చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కొత్త మార్గదర్శకాల తోనైనా బట్టీల ఆగడాలకు, కార్మికుల దోపిడీకి బ్రేక్ పడుతుందో లేదో వేచి చూడాలి.

# సంఘాలు.. అనుబంధాలు!

బొగ్గుబాయిలో కొత్త బంధాలు పుడుతున్నాయా? మైన్స్ సాక్షిగా మేటర్ మలుపులు తిరగబోతోందా? తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణల ప్రభావం సింగరేణి ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందా? పాత మిత్రుల్ని పక్కనపెట్టి... కొత్త వాళ్ళు దోస్త్ మేరా దోస్త్ అంటూ సాంగ్ సింగబోతున్నారా? అసలేంటా సమీకరణలు? ఇప్పుడు కొత్తగా ఎందుకు మాట్లాడుకోవాల్సి వస్తోంది? తెలంగాణలోని ఆరు జిల్లాలు, 11 ఏరియాల్లో విస్తరించి ఉంది సింగరేణి. ఎన్నిక ఏదైనా సరే... ఇక్కడి కార్మికుల ఓట్లు చాలా కీలకం. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఇక్కడ స్పెషల్ ఫోకస్ పెడుతుంటాయి. ఆ ప్రయారిటీలోనే... సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నిక కూడా అసెంబ్లీ ఎలక్షన్స్‌ని తలపిస్తూ ఉంటుంది. ప్రస్తుతం బొగ్గుబాయిల్లో అదే హీట్ పెరుగుతోందట. గుర్తింపు సంఘానికి రెండేళ్ల పదవీ కాలం ముగియడంతో సంస్థలో మళ్లీ ఎన్నికల మూడ్ వచ్చేసింది. కానీ...

ఇక్కడే ఓ కొత్త వివాదం కూడా మొదలైంది. గడువు తీరిపోయినందున ప్రత్యేకంగా గుర్తింపు సంఘం ఏదీ లేదు కాబట్టి అన్ని యూనియన్స్‌కు సమాన హోదా ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. ఆ డిమాండ్‌ను ఆమోదిస్తే...నిన్నటిదాకా అధికారం ఉన్న ఏఐటీయూసీ ప్రాధాన్యత తగ్గినట్టేనా? మళ్ళీ ఎన్నికలై ఫలితాలు వచ్చేదాకా యాజమాన్యంతో సంప్రదింపుల్లో ఆ సంఘాన్ని కూడా మిగతా వాటితో సమానంగా చూస్తారా లేక కొంచెం ఎక్కువ సమానం అంటారా అన్న చర్చలు జరుగుతున్నాయి కార్మిక వర్గాల్లో. అదే సమయంలో బీఆర్ఎస్‌తో పొత్తుకు సీపీఐ సై అంటోందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. మామూలుగా అయితే.... రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్, సీపీఐ మిత్రపక్షాలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కలిసే పోటీ చేశాయి. కానీ... మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో వ్యవహారం కాస్త తేడాగా కనిపించింది. అక్కడక్కడా బీఆర్ఎస్, సీపీఐ స్నేహగీతం ఆలపించాయి. ఇప్పుడు అదే ఈక్వేషన్ సింగరేణిలో కూడా వచ్చి ఆ బంధం అలాగే కొనసాగుతుందా అన్న చర్చలు మొదలయ్యాయి రాజకీయవర్గాల్లో. చివరిసారిగా 2023 డిసెంబర్ 27న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా ఎన్నికయ్యాయి. ఇప్పుడు ఆ రెండిటి కాలపరిమితి ముగిసినందున యాజమాన్యం నిర్వహించే అధికారిక సమావేశాలకు అన్ని యూనియన్స్‌ను కలిపి పిలవాలన్న డిమాండ్ తెర మీదికి వచ్చింది.

అలాగే... కాలయాపన చేయకుండా వెంటనే ఎన్నికలు నిర్వ హించాలని ప్రతిపక్ష సంఘాలు కోరుతున్నాయి. అలాగే... ఆయా మైన్స్‌తో పాటు కంపెనీ వ్యాప్తంగా అన్ని సంఘాలకు సమాన హోదా ఇవ్వాలంటూ ఎక్కడికక్కడ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. ఇక ఇదే సమయంలో ఎన్నికల కోసం అన్ని యూనియన్లు, వాటి ప్రధాన పార్టీలు కసరత్తులు మొదలు పెట్టడం ఆసక్తికరంగా మారింది. సరిగ్గా ఇక్కడే మున్సిపల్ ఎన్నికల నాటి పరిణామాలు చర్చకు వస్తున్నాయి. ఇప్పటికే సింగరేణి ప్రాంతమైన క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో సీపీఐ పొత్తుపెట్టుకుంది. సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీనే నిన్నటిదాకా సింగరేణిలో గుర్తింపు సంఘం. రాష్ట్ర స్థాయి పొత్తు కోణంలో గతంలో సీపీఐ, దాని అనుబంధం సంఘం సైతం కాంగ్రెస్‌తోనే ఉన్నాయి. కానీ... ఇప్పటికీ అదే అవగాహన ఉందా లేదా అన్నది ఇప్పుడు వస్తున్న సరికొత్త డౌట్. సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ కాంగ్రెస్ సంఘంతో కలిసి వెళ్తుందా లేక బీఆర్ఎస్ అనుబంధ సంఘానికి దగ్గరవుతుందా? లేక ఈ రెండూ కాదని సోలో సాంగ్ పాడుతుందా అన్నది ప్రస్తుతం కోల్ బెల్ట్‌లో ఇంట్రస్టింగ్ టాపిక్. మరి కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహిస్తుందా, లేక తాత్సారం చేస్తారా? అన్నది చూడాలంటున్నారు పరిశీలకులు. ఒకవేళ షెడ్యూల్ ప్రకారం ఎలక్షన్ జరిగితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీల బంధాలు, సంఘాల అనుబంధాలు ఎలా ఉంటాయన్నది మాత్రం కాస్త ఇంట్రస్టింగ్ సబ్జెక్టేనన్నది వాళ్ళ మాట.



# నకిలీ రైతుల ఆగడాలకు బ్రేక్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పంటలు సాగు చేయకుండా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న నకిలీ రైతుల కట్టడికి వ్యవసాయ శాఖ ప్లాన్ వేసింది. డిజిటల్ క్రాప్ సర్వేతో వారిని గుర్తించి అసలైన రైతులకు న్యాయం చేసేందుకు సిద్ధమైంది. ఈ సర్వేతో సాగు చేయకుండా పథకాలు పొందేవారి చిట్టా బయటపడుతోంది. వారంతా గత 10 ఏళ్లుగా రైతు బంధుతో పాటు, విపత్తులకు పంట నష్టం జరిగితే దర్జాగా పరిహారం ఖాతాలో వేసుకున్నారు.

**సర్వేతో మంచి ఫలితాలు..**

రాష్ట్రంలో నిజమైన రైతులకు ప్రభుత్వం అందించే ఏ పథకం పూర్తిగా అందడం లేదని భావించిన వ్యవసాయ శాఖ నిజమైన రైతులకు న్యాయం చేసేందుకు అనేక ప్రయోగాలు చేసింది. ఈ నేపథ్యంలో నిజంగా పంట సాగు చేసే రైతులను గుర్తించేందుకు వ్యవసాయ విస్తరణాధికారులతో పాటు, వారికి తోడు వాలంటీర్లను నియమించింది. వారు ప్రతి సర్వే నెంబర్‌కు వెళ్లి ఏ పంట సాగు చేశారో రైతు వివరాలను సేకరిస్తూ ఫొటోలు తీసి కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖకు వివరాలు పంపిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు ఎలాంటి సాగు చేయని పట్టాదారు పాసుబుక్‌కలిగిన రైతులు అనేక పథకాలు ఉచితంగా పొందినట్లు తేలింది.

**సాగు చేస్తేనే కొనుగోలు చేసేలా..**

ఇక నుంచి పత్తి, ధాన్యం కొనుగోళ్లలో పంటలు సాగు చేసే రైతుల నుంచి కొనేందుకు వ్యవసాయ శాఖ ప్లాన్ చేస్తున్నది. గతంలో దళారులు చిన్న, సన్నకారు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన పంటలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు దర్జాగా అమ్ముతూ లక్షలు సంపాదిస్తున్నారు.

ఈ క్రమంలో పంట పండించే రైతు కంటే బ్రోకర్లు బాగుపడుతున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. వారి అరాచకాలకు ముకుతాడు వేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**పక్క రాష్ట్రాల నుంచి సన్నవడ్లు**

రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో సన్నాల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించి కొనుగోలు చేస్తుండటంతో దళారులు దందాకు తెగబడ్డారు.

పక్క రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల నుంచి తక్కువ ధరకు సన్న వడ్లను కొనుగోలు చేసి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్‌జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు జరిపినట్లు పౌరసరఫరాల శాఖకు ఫిర్యాదులు అందాయి. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన సన్నాలు నాణ్యతగా లేవని సీఎంఆర్ చేసిన మిల్లర్లు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ శాఖ కొత్త మార్గాలు కనిపెట్టి సాగు చేసిన రైతులను గుర్తించి వారి పంట కొనుగోలు చేసేలా సర్వే చేపడుతుంది.

# పట్టు వదలని బీఆర్ఎస్..!




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి పెంచుతున్నది. ఈ అంశంపై బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నది. ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. స్పీకర్ తేల్చడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టు పలు దఫాలుగా విచారించి స్పీకర్ మీద ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాకుండా నేటి వరకు గడువునిచ్చింది. ఆ గడువు గురువారంతో ముగియనుండడం.. సుప్రీంకోర్టులో నేడు విచారణ ఉండడంతో స్పీకర్ బుధవారమే తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలు పార్టీ మారినట్లుగా ఆధారాల్లేవని, దీంతో ఫిర్యాదును కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు 8 మంది ఎమ్మెల్యేకు సైతం స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నది. ఇదే అంశాన్ని తెలంగాణ భవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ప్రకటించారు.

**అనర్హత వేటు వేయాలని డిమాండ్..**


బీఆర్ఎస్ నుంచి ఎన్నికై తర్వాత ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వడం లేదా పార్టీ మారడం వంటి చర్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన గులాబీ పార్టీ నేతలు.. దీనిని రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు ద్రోహం చేశారని ఆరోపిస్తూ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై తక్షణం అనర్హత వేటు వేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ హైకోర్టుకు వెళ్లి బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధవుతున్నారు.

**పోరాడుతామని బీఆర్ఎస్ క్లారిటీ..**

రాష్ట్రంలో గతంలోనూ ఫిరాయింపుల అంశం పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. అయితే, ఈసారి బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉండటం వల్ల ఈ వ్యవహారాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్తున్నది. పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఈ పోరాటం కొనసాగుతున్నదని చెబుతున్నారు. ప్రజలు ఒక పార్టీకి ఓటు వేసి గెలిపించాక ప్రజాప్రతినిధులు మధ్యలో పార్టీ మారడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధమని వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ కేసు తీర్పు తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కఠినంగా స్పందిస్తే భవిష్యత్తులో ఇలాంటి రాజకీయ పరిణామాలకు కొంతమేర అడ్డుకట్ట పడే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు ఈ వ్యవహారం అసెంబ్లీ రాజకీయాల్లోనూ చర్చకు దారితీసే అవకాశముంది.

# భారీగా చెలరేగిన మంటలు

## ఒమన్‌లోని సలాలా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్ అటాక్స్..



**టెహ్రాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు అంతే స్థాయిలో ఇరాన్ ప్రతి దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే అమెరికా మిత్ర దేశమైన ఒమన్‌పై తాజాగా ఇరాన్ అటాక్ చేసింది.

ఒమన్‌లోని సలాలా ఓడరేవు లక్ష్యంగా డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. పోర్టులోని చమురు నిల్వ ట్యాంకులను ఇరాన్ డ్రోన్లు ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ అలుముకుంది. ఈ దాడులను ఒమన్ టీవీ, బ్రిటిష్ సముద్ర భద్రతా సంస్థ ధృవీకరించాయి. అయితే.. ఈ దాడిలో వ్యాపార నౌకలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని సమాచారం. ఇరాన్ డ్రోన్లు పోర్టుపై దాడి చేయడం, ఆ వెంటనే ఆకాశనంటేలా మంటలు చెలరేగిన దృశ్యాలు ఆన్ లైన్లో వైరల్‌గా మారాయి.

**ఒమన్ సుల్తాన్ సీరియస్:**

సలాలా ఓడరేవుపై ఇరాన్ దాడులను ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్ అల్ సైద్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులు జరిగిన వెంటనే ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌ను సంప్రదించి ఒమన్ భూభాగంలో జరుగుతున్న దాడులపై తీవ్ర ఆందోళనలను తెలియజేశారు. మిడిల్ ఈస్ట్ వార్‌లో ఒమన్ తటస్థ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు. ఒమన్ సార్వభౌమాధికారం, భద్రత, స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. అయతొల్లా ఖమేనీ వారసుడిగా ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అయినందుకు మోజ్తాబా ఖమేనీని ఒమన్ సుల్తాన్ అభినందించిన కొద్దిసేపటికే ఈ దాడులు జరిగాయని ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పేర్కొంది.

# నోటీసులపై కవిత ఫస్ట్ రియాక్షన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీబీఐ నోటీసులు ఇవ్వడం పట్ల జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరుకావాలని సీబీఐ అధికారులు తెలిపారని. సీబీఐ నోటీసులపై మా లీగల్ టీమ్ తో చర్చిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేసిన కవిత.. 'ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో చార్జెస్ ఫ్రేమ్ చేయడానికి కూడా రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరిస్తూ కేసును కొట్టేసింది. కేసు కొట్టేయడంతో పాటు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను సైతం ఎంక్వయిరీ చేయాలని సైతం కోర్టు కామెంట్ చేసింది. ఇదంతా మీ అవగాహనలో ఉన్నది. అయితే రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ ఈనెల 16న ఉన్నదన్న విషయాన్నీ సీబీఐ అధికారులు స్వయంగా తెలియ చేశారు.



సత్యం నా తోడుగా ఉన్నంత వరకు సంపూర్ణంగా అధికారులకు సహకరిస్తాను' అని ట్వీట్ చేశారు.

**రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ!:**

దేశ రాజకీయాల్లో సంచలనంగా మారిన లిక్కర్ స్కామ్ కేసులో కవితను 2024 మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. ఈ కేసు విచారణ అనంతరం కవితను తిహార్ జైలుకు తరలించారు. అదే ఏడాది ఆగస్టులో కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అంతకు ముందే ఢిల్లీ మద్యం పాలసీలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కవితను అరెస్టు చేయడం తెలంగాణ రాజకీయాల్లో సెన్సేషన్ గా మారింది. అయితే ఇప్పుడు కవిత బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయి సొంతంగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో సీబీఐ నుంచి మళ్లీ నోటీసులు రావడంతో స్టేట్ పాలిటిక్స్ లో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయనేది వేచి చూడాలి.

# కుళ్లిన మాంసం దందా

- ఇతర రాష్ట్రాల్లో కొని నగరానికి
- దుర్వాసన రాకుండా డీప్ ఫ్రీజర్లు, ప్లాస్టిక్ టబ్‌లలో నిల్వ
- ఫ్రెష్ అంటూ కస్టమర్లకు అమ్మకం
- 300 కేజీల మాంసం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

**మెహిదీపట్నం,ఫ్లాష్ ఇండియా :** మంగళ్‌హాట్ పరిధిలో కుళ్లిన మాంసం దందా గుట్టురట్టైంది. అమాయక ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కుళ్లిన మాంసం విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి అరెస్ట్ చేశారు. బుధవారం గోల్కొండ జోన్ అదనపు డీసీపీ కృష్ణ గౌడ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. మహ్మద్ అఫ్రోజ్ (41) అనే వ్యక్తి అక్రమ లాభాల కోసం కర్నాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, జమ్మూ కాశ్మీర్ తదితర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు జబ్బులు పడిన లేదా చనిపోయిన మేకలు, గొర్రెల మాంసం కరిస్తున్నాడు.మంగళ్‌హాట్ పరిధి చిస్తి చమాన్ లోని ఎ టూ జెడ్ మీట్ షాపులో దుర్వాసన రాకుండా డీప్ ఫ్రీజర్లు, ప్లాస్టిక్ టబ్‌లలో వీటిని నిల్వ ఉంచి, ఆ మాంసాన్ని తాజాగా ఉన్నట్లు నమ్మించి కస్టమర్లకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఈ దుకాణంపై ఈ నెల 10న అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 300 కిలోల మేక, గొర్రె మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ నిందితుడిపై పలు కేసులు ఉన్నాయని తెలిపారు.ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో ఆహారపదార్థాలు కొనుగోలు చేయవద్దని డీసీపీ కోరారు. జోన్ డీసీపీ చంద్ర మోహన్, ఏసీపీ సుదర్శన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు వినోద్, శృతి, సిబ్బంది ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారన్నారు.

# ట్రంప్‌నకు.. మోదీ ఎందుకు భయపడుతున్నారు

**ఢిల్లీ :** ఎల్పీజీ సిలిండర్ ధరల పెరుగుదల, కొరతపై పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. కట్టెల పొయ్యిలు, వంట పాత్రలు, ఎల్పీజీ సిలిండర్ల పోస్టర్లతో నిరసనకు దిగారు. విపక్షాల ఆందోళనలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇండియా కూటమి ఎంపీలు పాల్గొన్నారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదని నిలదీశారు.

**ఎల్పీజీ సమస్యను పరిష్కరించాలి..**

ఎల్పీజీ సమస్యను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. 18వ లోక్‌సభలో కేంద్రప్రభుత్వం వాస్తవాలు మాట్లాడనీయడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీ ప్రభుత్వ అజెండాగా మారిందని ఆగ్రహించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడే మాటలను నరేంద్రమోదీ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ట్రంప్ చర్యలను మోదీ ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ట్రంప్‌నకు మోదీ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ పరిస్థితులు, ప్రభావంపై ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# చర్లపల్లి-కామాఖ్య ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ బుకింగ్స్ ప్రారంభం




**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** చర్లపల్లి కామాఖ్య మధ్య నడిచే ట్రైన్ నంబర్ 15673 ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ బుకింగ్స్ గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి ప్రారంభమవుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా లేదా రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ రైలు సేవ ప్రారంభంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అసోం రాష్ట్రంలోని కామాఖ్య ప్రాంతానికి ప్రయాణించే వారికి మరింత సౌకర్యవంతమైన రైల్వే కనెక్టివిటీ లభించనుంది.

# ఈ నెలలో రైతు భరోసా..

## అదిరియే ప్రకటన చేసిన మంత్రి వివేక్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర రైతులకు అదిరిపోయే శుభవార్త అందింది. రైతు భరోసా నిధుల విడుదలపై తాజాగా తెలంగాణ మంత్రి వివేక్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల నుంచి రైతు భరోసా నిధుల పంపిణీ ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. రైతు భరోసా కింద మొత్తం రూ.9000 కోట్లకు పైగా రైతుల ఖాతాలలో వేయనున్నట్లు వెల్లడించారు. మార్చి మాసంలో తొలి విడతగా రూ. 4500 కోట్లు విడుదల చేస్తామని తెలిపిన మంత్రి వివేక్, మిగతావి వచ్చే నెలలో రిలీజ్ చేస్తామని క్లారిటీ ఇచ్చారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రజల కోసం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. సన్న వడ్లు పండించే 90% రైతులకు బోనస్ కూడా అందిస్తున్నట్లు వివరించారు మంత్రి వివేక్. నిత్యం రైతుల సంక్షేమం అన్నట్లుగానే తమ ప్రభుత్వం నడుస్తుందని వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు అయిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం రైతన్నల కోసం కృషి చేయాలని తెలిపారు.ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు చేశారు. డీసీఎంఎస్, ఐకేపీ సెంటర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మొత్తం మార్కెట్ కమిటీ పైన ఉంటుందని గుర్తు చేశారు. అదే సమయంలో గత కేసీఆర్ సర్కారుపై విమర్శలు కూడా చేశారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన ప్రాజెక్టును పక్కకు పెట్టి కాళేశ్వరం ఎందుకు కట్టారని నిలదీశారు.

# కేటీఆర్‌ను కలిసిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర వ్యాప్తంగా నియమితులైన లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో దాదాపు 5 వేల మందికి పైగా సర్వేయర్ల ప్రతినిధులు ఆయనను కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. నెలల తరబడిగా తమకు అటు పని, ఇటు వేతనం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని వారు ఆరోపించారు.ప్రభుత్వం తమను నియమించి నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు పని కేటాయింపులు జరగలేదని, ఫలితంగా జీతభత్యాలు అందక తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని సర్వేయర్లు వాపోయారు. ప్రతిరోజూ తమను ఎమ్మార్వో కార్యాలయాలకు పిలిపిస్తున్నారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోబెడుతున్నారు తప్ప ఒక్క పని కూడా అప్పగించడం లేదని వారు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటక వంటి రాష్ట్రాల్లో లైసెన్సుడ్ సర్వేయర్లకు స్థిరమైన ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయని, కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి' పేరుతో తమను మోసం చేసిందని కామెంట్ చేశారు. పనుల కేటాయింపులో స్పష్టమైన విధానం లేదని, అందరికీ సమానంగా పనులు దక్కేలా ఒక సమగ్రమైన పద్ధతిని అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

**కేటీఆర్ హామీ..**

సర్వేయర్ల సమస్యలను ఓపికగా విన్న కేటీఆర్ వారి వినతి పత్రాన్ని స్వీకరించారు. కష్టపడి శిక్షణ పొంది, లైసెన్సులు పొందిన నిరుద్యోగ యువతను ప్రభుత్వం ఈ విధంగా వదిలేయడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలోనూ, బయట కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు.

# ఇరాన్‌తో ఫలించిన జైశంకర్ దౌత్యం



**ఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలను చమురు, గ్యాస్ సంక్షోభం వెంటాడుతోంది. తీవ్ర భయాందోళనలు నెలకొన్న తరుణంలో భారతదేశానికి మంచి శుభవార్త అందింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ జరిపిన దౌత్యం చక్కటి ఫలితాన్ని ఇబ్బంది. దీంతో హోర్ముజ్ జలసంధి నుంచి భారత్ చమురు ట్యాంకర్లు బయల్దేరేందుకు లైన్ క్లియర్ అయింది. ప్రస్తుతం భారత్ ఆయిల్ ట్యాంకర్లు కదిలేందుకు ఇరాన్ మార్గం సుగమం చేసినట్లుగా గురువారం కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామం భారతీయులకు తీపి కబురుగానే చెప్పొచ్చు.మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా తలెత్తిన చమురు, గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో పాటు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్, ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారోతో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఫోన్ కాల్ సంభాషణ చేశారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై చర్చించారు. అంతర్జాతీయ పెద్దలతో జరిపిన సంభాషణ తాజాగా సత్‌ఫలితాన్ని ఇచ్చినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న భారత్ చమురు ట్యాంకర్లు జలసంధిని దాటేందుకు ఇరాన్ మార్గం సుగమం చేసింది. అన్ని విధాలుగా రూట్ క్లియర్ చేసినట్లుగా తాజాగా కేంద్ర వర్గాలు పేర్కొన్నట్లుగా జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిలో శత్రు దేశాలకు వెళ్లే ఆయిల్ ట్యాంకర్లను ఇరాన్ నిలిపివేసింది. అమెరికా, యూరప్, ఇజ్రాయెల్‌లకు వెళ్లే నౌకలపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో భారతదేశానికి ఇరాన్ ప్రత్యేక రాయితీని మంజూరు చేసింది. భారత్ ట్యాంకర్లు విడిచి పెట్టేందుకు ఇరాన్ అంగీకరించింది. రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో జైశంకర్ జరిపిన చర్చల ఫలితంగానే ఇదంతా జరిగినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

# రంగంలోకి ఆశావహులు

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ బరిలో నిలబడాలని ఉవ్విళ్ళూరుతున్న ఆశావహులు జనాల్లో తిరగడం మొదలుపెట్టారు. తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక మిగిలింది ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు. ఇవి కూడా పూర్తయితే స్థానిక సంస్థల సమరం పూర్తిగా ముగిసినట్లవుతోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల గురించి ఆలోచిస్తోంది. సర్పంచ్ ఎన్నికలు పూర్తి కాగానే వెంటనే ఈ ఎన్నికలు జరుగుతాయనే అంచనాలున్నప్పటికీ, మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం ఇక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలే. ఇవి కూడా జూన్ నెల తర్వాత జరిగే సూచనలున్నాయని తెలుస్తోంది. తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జూన్ 12 వరకు కొనసాగుతుండటంతో జూన్ నెల తరువాతే రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇక ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. టికెట్ల కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాలని, వెనక పడితే టికెట్ అవకాశాలు గల్లంతవుతాయని ఆశావహుల్లో చాలా మంది భయపడుతున్నట్లు తెలుస్తోంది.

**సర్పంచ్ ఎన్నికల్లో అవకాశం రాని వారికి..**


కొద్ది నెలల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాని వారికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇవ్వాలని, టికెట్ల కేటాయింపుతో ప్రధాన్యత ఇవ్వాలనే డిమాండ్ అధికార పార్టీలో ఎక్కువగా వినిపించే ఛాన్సుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు నేరుగా తమకే టికెట్ కావాలని పెద్ద నేతలను ఎవరూ కలవకపోయినా టీపీసీసీ చీఫ్ నిజామాబాద్ కు వచ్చినప్పుడల్లా ఆశావహులంతా ఆయన చుట్టూనే తిరుగుతున్నట్లు పార్టీలో చెప్పుకుంటున్నారు. జిల్లాలో ఆయన ఆశీర్వాదం ఉంటే టికెట్ కచ్చితంగా దక్కుతుందని, పోటీ చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయం చాలా మంది ఆశావహుల్లో ఉంది.

**ఈసారి జిల్లా పరిషత్ ను కైవసం చేసుకునేందుకు పక్కా వ్యూహం..**

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లా పరిషత్ లు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గెలుచుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎట్టి పరిస్థితుల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా పరిషత్ లు రెండింటిని కాంగ్రెస్ పార్టీనే గెలుచుకోవాలని టీపీసీసీ చీఫ్ ఇప్పటికి ఎన్నో సార్లు పార్టీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మెజారిటీ మండల పరిషత్ లు గెలుచుకోవడంతో పాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా పరిషత్ లను కూడా కైవసం చేసుకోవాలనేది కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి తోడు బీఆర్ఎస్ కూడా మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలుచుకుని సత్తా చాటాలని చూస్తోంది. బీఆర్ఎస్ కూడా పార్టీకి పట్టున్న చోట సీట్లు గెలవడానికి పార్టీ అంతర్గత సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తోంది. మరోపక్క రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం కసరత్తును ప్రారంభించడంతో ఆశావహుల్లో అలజడి పెరిగింది. జూన్ తర్వాత ఎన్నికలు జరిగే అవకాశాలుండటంతో ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెడితే తప్ప ప్రయోజనం ఉండదనే ఆలోచనలో ఆశావహులున్నట్లు తెలుస్తోంది.

# భార్య వేధింపులకు భర్త బలి..

## కష్టపడి సీఐని చేస్తే.. చావునే బహుమతిగా ఇచ్చింది!



**నేరేడ్మెట్,ఫ్లాష్ ఇండియా :** భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్ గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేకపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# డిమాండ్.. సప్లైపై ఆరా తీస్తాం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శుక్రవారం గ్యాస్ ఏజెన్సీలతో సమావేశం అవుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ డిమాండ్, సప్లైపై ఆరా తీస్తామని అన్నారు. గ్యాస్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలకు మంత్రి ఉత్తమ్ వార్నింగ్ ఇచ్చారు. గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్లలో విక్రయిస్తే ఏజెన్సీలు రద్దు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో డొమెస్టిక్ గ్యాస్‌కు ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కమర్షియల్ సిలిండర్ల కొరత ఉందని తెలిసిందని అన్నారు. రేపటి సమావేశంలో అన్ని సమస్యలకు పరిష్కారం చూసుతామని తెలిపారు. మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

# అవినీతి వలలో చిక్కిన తహసీల్దార్..



**గజ్వేల్,ఫ్లాష్ ఇండియా :** ప్రజాసేవ చేయాల్సిన ఉన్నతాధికారి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ ఆస్తుల వేటలో పడ్డారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కాటన్ శ్రవణ్ కుమార్.. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న పక్కా సమాచారంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలో లభించిన డాక్యుమెంట్లు, నగదు చూసి అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. కరీంనగర్‌లోని శ్రవణ్ కుమార్ నివాసం, ఆయన సోదరి ఇల్లు, ఇతర కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో సుమారు రూ. 4 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే.. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల విలువ ఇంకా భారీగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. సోదాల్లో పట్టుబడిన వాటిలో.. రూ. 11.90 లక్షల నగదుతో పాటు రూ. 4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి. రూ. 30 లక్షల విలువైన లగ్జరీ కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయి. కరీంనగర్‌లో రెండు సొంత ఇళ్లు, ఒక అపార్ట్‌మెంట్‌లో ఆరు ఫ్లాట్లు, మరో నాలుగు ఖాళీ స్థలాలకు సంబంధించిన పత్రాలు.. వీటి విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 2.47 కోట్లుగా తేల్చారు. దాదాపు రూ. 15.66 లక్షల విలువైన విలాసవంతమైన వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు. తన అధికారిక హోదాను ఉపయోగించుకుని శ్రవణ్ కుమార్ అక్రమంగా ఈ సంపదను ఆర్జించినట్లు ఏసీబీ దర్యాప్తులో స్పష్టమైంది. దీనిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, ఆయనను అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# హుక్కా అమ్మకాల పై సూర్యాపేట పోలీసుల ఉక్కుపాదం..



**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** ప్రజల ఆరోగ్యాలను హరించే వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ హెచ్చరించారు. నమ్మదగిన సమాచారం మేరకు సూర్యాపేట పట్టణ పోలీసులు సూర్యాపేట పట్టణం మెయిన్ రోడ్‌లోని ఆర్వీ ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ ఫ్యాషన్స్ వస్త్ర దుకాణాల్లో హుక్కా అమ్మకాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 15 వేల విలువైన ఉక్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురి పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యాలను హరించే ఇలాంటి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హుక్కా సేవించడం వల్ల ఆరోగ్యాలు చెడిపోతాయని, యువత ఇలాంటి చెడు అలవాట్లకు లోనుకావొద్దని పేర్కొన్నారు. ఇలాంటి అమ్మకాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ప్రజలను కోరారు.

# ఇందిరమ్మ గృహాలు,సిసి రోడ్ల ప్రారంభం...





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ మండలం దుబ్బ తండా గ్రామపంచాయతీ మరియు కుంటకింది తండా గ్రామాలలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళు మరియు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళు లబ్దిదారులు ఎమ్మెల్యే బిఎల్ఆర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద ప్రజల సొంత కలలను నెరవేరుస్తునందుకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధి దారులు ప్రజా ప్రభుత్వం పై చూపిస్తున్న ఆదరణకు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా గర్వ పడుతున్నాను అని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగిన దగ్గర నుంచి నేటి వరకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక పథకాలు పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజా పాలన అందిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఓటీఆర్ సవరణపై మరో కీలక అప్డేట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** టీజీపీఎస్సీ నిర్వహించే ఉద్యోగ నియామక ప్రక్రియలో వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది అత్యంత ముఖ్యమైనది. భవిష్యత్తులో టీజీపీఎస్సీ విడుదల చేసే నోటిఫికేషన్లకు అభ్యర్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు, కుల ధ్రువీకరణ, స్థానికత వంటి అన్ని వివరాలు ఒకే చోట డిజిటల్ రూపంలో ఓటీఆర్‌లో భద్రపరచబడతాయి. దీంతో ప్రతి నోటిఫికేషన్‌కు మళ్ళీ పూర్తి వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. అందువల్ల టీజీపీఎస్సీ విడుదల చేసే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఓటీఆర్ అప్డేట్ చేసుకోవాలని సూచించింది. ఒక్కసారి OTR పూర్తి చేస్తే భవిష్యత్తులో వచ్చే గ్రూప్-1, 2, 3, 4 వంటి ఏ నోటిఫికేషన్‌కైనా కేవలం మీ TGPSC ID మరియు పుట్టిన తేదీతో లాగిన్ అయి సంబంధిత పోస్టులకు ఫీజు చెల్లించి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే.. గత నెల(ఫిబ్రవరి) 25 వరకు ఉన్న ఓటీఆర్ సవరణ గడువు కమిషన్ మార్చి 25 వరకు పొడిగించింది. అభ్యర్థుల అభ్యర్థనలు మరియు సర్టిఫికేట్ల అప్లోడింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. తాజాగా టీజీపీఎస్సీ మరో కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు మాత్రమే ఓటీఆర్‌లో పొందుపరిచేందుకు వెసులుబాటు కల్పిస్తుంది.

**ఏడాదికి రెండు సార్లు..**

టీజీపీఎస్సీ తాజాగా ఒక కొత్త సంస్కరణను తీసుకువచ్చింది. ఇక పై అభ్యర్థులు ఏడాదికి రెండుసార్లు మాత్రమే తమ ఓటీఆర్‌ను అప్‌డేట్ చేసుకునే వీలుంటుంది. ప్రతి ఏటా జనవరి, జూన్ నెలల్లో సుమారు 10 రోజుల పాటు ఈ విండో అందుబాటులో ఉంటుంది. ఈ తరుణంలో కొత్తగా పొందిన విద్యార్హతలు లేదా ఇతర మార్పులను మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించింది.

**ముందుగా తనిఖీ చేసే సర్టిఫికేట్స్ ఇవే!**

ఓటీఆర్‌లో నమోదు చేసిన కుల, ఆదాయ, క్రిమీలేయర్, నాన్ క్రిమీలేయర్, విద్యార్హతల వివరాలను టీజీపీఎస్సీ ముందస్తుగా తనిఖీ చేస్తుంది. ఈ క్రమంలో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌లో పొందుపర్చిన విద్యార్హతల ఆధారంగా భవిష్యత్తులో ఏదైనా నోటిఫికేషన్లకు వారు అర్హులా? లేదా అనేది టీజీపీఎస్సీ గుర్తిస్తోంది. అందులో నమోదు చేసిన వివరాలను టీజీపీఎస్సీ మీసేవ, యూనివర్సిటీ, ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్య సహాయంతో పరిశీలిస్తుంది. ఎవరైన తప్పుడు ధ్రువీకరణతో నమోదు చేసినట్లు వెల్లడైతే వెంటనే వారి ఓటీఆర్ రద్దు చేస్తుంది.

**తప్పనిసరి మార్పులు..**

రాబోయే కొత్త నోటిఫికేషన్లకు(గ్రూప్-1, 2, 3, 4) దరఖాస్తు చేయాలంటే పాత ఓటీఆర్ వివరాలను అప్‌డేట్ చేయడం ఇప్పుడు తప్పనిసరిగా పేర్కొంది. ఓటీఆర్ సవరణలో చేయాల్సిన మార్పులు ఇవే.

- అభ్యర్థులు తమ తాజా కలర్ ఫోటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికేట్లను డిజిటల్ రూపంలో అప్‌లోడ్ చేయాలి.
- కొత్తగా పొందిన అదనపు విద్యార్హతలను నమోదు చేయడంతో పాటు దానికి సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించాలి.
- ఓటీఆర్‌లో అదనపు అర్హతలు చిరునామా, జుబో, నాన్ క్రిమీలేయర్ కేటగిరీలు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ మినహా మిగతా వివరాలు అప్‌డేట్ చేయడానికి వీల్లేదు
- ఎస్సీ వర్గీకరణలో జరిగిన మార్పుల దృష్ట్యా, ఆ కేటగిరీ అభ్యర్థులు తమ వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.
- గమనిక:అభ్యర్థులు పాత యూజర్ ఐడీని ఉపయోగిస్తుంటే.. అందులో ముఖ్య విషయాన్ని గమనించాలి. అది ఏంటంటే.. ప్రస్తుతం లాగిన్ అయినప్పుడు 'TS' స్థానంలో 'TG' అని టైప్ చేయాల్సి ఉంటుంది. మిగిలిన అంకెలు అవే ఉంటాయి.



# సైదాబాద్‌లో అగ్నిప్రమాదం..

**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** నగరంలోని సైదాబాద్ పరిధిలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గడ్డన్నారం ఎస్‌బీఐ కాలనీలోని వెంచర్ --01 ప్రాంతంలో ఉన్న జి.ఏ--11 నంబర్ ఇంటిలో ఈ ఘటన జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నివాస భవనంలోని మొదటి అంతస్తులో నిల్వ ఉంచిన గృహోపకరణాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మలక్‌పేట్ ఫైర్ స్టేషన్‌కు చెందిన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మొహమ్మద్ షౌకత్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నీటి జెట్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించడంతో మంటలు పూర్తిగా ఆర్పివేయబడ్డాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. అయితే ఇంటిలో నిల్వ ఉంచిన కొన్ని గృహోపకరణాలు మంటల్లో దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సమయోచిత చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

# ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సి నారాయణ రెడ్డి సూచించారు. గురువారం శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు నిర్వహించిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా సర్పంచులు గా ఎన్నికైన అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన మీరంతా మీ సమయాన్ని వృధా చేయకుండా సమయాన్ని వెచ్చించాలని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. 99 రోజుల పాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు. 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి వారిని పథకాల అమలులో భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఐడి కార్డులను, 99 రోజుల ప్రణాళిక బుక్స్ అందజేయడం జరిగింది. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు, మండలాల అధికారులు, సర్పంచులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గంభీర్-అగార్కర్ మధ్య విభేదాలు..!



టీ20 వరల్డ్ కప్ 2026 ముగిసింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలిచి.. పొట్టి కప్ కైవసం చేసుకుంది. ప్రస్తుతం ప్లేయర్స్ అందరూ ఇళ్లకు చేరుకొని వరల్డ్ కప్ విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సమయంలో టీమిండియా గురించి ఓ ఆసక్తికర న్యూస్ బయటికొచ్చింది. టీ20 వరల్డ్ కప్ జట్టు ఎంపిక సందర్భంగా కీలక చర్చలు జరిగాయని సమాచారం. ముఖ్యంగా యువ బ్యాటర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎంపిక విషయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.రిపోర్టుల ప్రకారం.. 2026 టీ20 వరల్డ్ కప్ జట్టులో శుభ్‌మన్ గిల్‌ను తప్పనిసరిగా చేర్చాలని కోచ్ గౌతమ్ గంభీర్ భావించాడు. అతని టెక్నికల్ క్లాస్, స్థిరమైన బ్యాటింగ్ టీమ్‌కు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడట. అయితే జట్టు కాంబినేషన్ విషయంలో సెలెక్టర్ అజిత్ అగర్కర్ తన నిర్ణయంను మార్చుకోలేదట. టీ20 ఫార్మాట్‌లో దూకుడైన ఆటగాళ్లు జట్టుకు మరింత ఉపయోగపడతారని అగార్కర్ భావించాడట. అందుకే సెలెక్టర్లు ఇషాన్ కిషన్, రింకూ సింగ్ వంటి హిట్టర్లను జట్టులోకి ఎంపిక చేయడానికే ప్రాధాన్యం ఇచ్చారట.

సెలెక్టర్ల అభిప్రాయం ప్రకారం శుభ్‌మన్ గిల్ మంచి ఆటగాడే అయినప్పటికీ.. 2026 టీ20 వరల్డ్ కప్ జట్టులో ప్రతి ఆటగాడికి ప్రత్యేక పాత్ర అవసరమని భావించారు. ఆ కారణంగానే గిల్ ఈసారి జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడని సమాచారం. మెగా టోర్నీ ముందు గిల్ ఫామ్ కోల్పోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిణామాలు భారత క్రికెట్ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గౌతమ్ గంభీర్–అజిత్ అగార్కర్ మధ్య జరిగిన ఈ చర్చ.. టీమ్ సెలక్షన్‌లో ఎంతగా ఆలోచనలు ఉంటాయో స్పష్టంగా తెలుస్తోంది. భారత్ టీ20 వరల్డ్ కప్ గెలవడంతో.. అగార్కర్ నిర్ణయం సరైందే అని ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# ఇషాన్ కిషన్ సూపర్ కంబ్యాక్!

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టీ20 ర్యాంకింగ్స్ తాజాగా విడుదల చేసింది. భారత యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అద్భుతమైన కంబ్యాక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. కొద్ది కాలం క్రితం వరకూ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 64వ స్థానంలో ఉన్న కిషన్.. ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి (871 పాయింట్లు) ఎగబాకి తన ప్రతిభను నిరూపించాడు.టీ20 ప్రపంచ కప్ 2026 ముందు న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు ముందు ఇషాన్ కిషన్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 64వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. 5వ టీ20లో కివీస్‌పై 43 బంతుల్లో 103 పరుగులు చేశాడు. సిరీస్ ముగిసే సరికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 32వ స్థానానికి చేరుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో కిషన్ రెచ్చిపోయాడు. ప్రపంచ కప్‌లో 35.22 సగటుతో 317 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 25 బంతుల్లో 54 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో తాజాగా విడుదలైన ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచాడు.64వ స్థానం నుంచి రెండో స్థానానికి రావడం ఇషాన్ కిషన్ కెరీర్‌లో గొప్ప కంబ్యాక్‌గా నిలిచింది. కిషన్ దూకుడు బ్యాటింగ్, భారీ షాట్లతో టీమ్ ఇండియాకు కీలక ఆటగాడిగా మారాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో వేగంగా పరుగులు చేయడం అతని ప్రత్యేకత. ఈ ప్రదర్శనతో ప్రపంచ క్రికెట్‌లో అతని స్థానం మరింత బలపడింది. ఇదే ఫామ్ కొనసాగిస్తే రాబోయే మ్యాచ్‌ల్లో కిషన్ ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానాన్ని కూడా అందుకునే అవకాశం ఉంది.


# ధోనికి భారీ ఊరట



ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్2026) మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ బెంగళూరు, హైదరాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇక ఐపీఎల్2026 ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఎంఎస్ ధోనికి భారీ ఊరట లభించింది. క్రికెట్‌కు సంబంధించి పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధనను ధోని ఉల్లంఘిస్తున్నాడంటూ దాఖలైన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ అధికారి అరుణ్ మిశ్రా కొట్టేశారు.చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడిగా ఉంటూనే.. ఓ క్రికెట్ అకాడమీతో అనుబంధం కొనసాగిస్తున్నారని 2024లో ధోనిపై ఫిర్యాదు దాఖలైంది. అయితే ధోని ఆ క్రికెట్ అకాడమీతో 2017లో ఒప్పందం చేసుకున్నాడు. కానీ, బీసీసీఐ పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధన 2018 సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో ధోని బీసీసీఐ నిబంధనను ఉల్లంఘించినట్లు కాదని జస్టిస్ అరుణ్ మిశ్రా అభిప్రాయపడ్డారు. అలాగే ధోని క్రికెట్ పరిపాలనలో ఎటువంటి నిర్ణయాలు తీసుకునే పదవిలో కూడా లేడని ఆయన స్పష్టం చేశారు. అతడు ఐపీఎల్‌లో కేవలం ఆటగాడిగానే కొనసాగుతున్నాడని తెలిపారు.క్రికెట్ అకాడమీలను కలిగిఉండటం, వాటితో ఒప్పందాలు చేసుకోవడం బీసీసీఐ నిబంధనల ప్రకారం నేరమేమీ కాదని మిశ్రా అభిప్రాయ పడ్డారు. ఫిర్యాదుదారుడు... ధోనితో తనకున్న వ్యక్తిగత, వాణిజ్య వివాదం కారణంగానే ఈ ఫిర్యాదు చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. అలాగే ఈ కేసులో ధోని ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆధారాలు లేకపోవడంతో ఫిర్యాదును కొట్టివే–స్తున్నామని జస్టిస్ అరుణ్ మిశ్రా పేర్కొన్నారు.

# గంభీర్ స్పీచ్‌తో ప్లేయర్లలో పూనకాలు!

భారత్ ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తోంది. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్పు సొంతం చేసుకున్న ఏకైక టీమ్‌గా అవతరించింది. ఈ వరల్డ్ కప్పు వెనుక క్రీడాకారులు, కోచ్‌ల కృషి వర్ణణాతీతం. మొదటి నుంచి ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న టీమ్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గంభీర్ ప్లేయర్స్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగం గురించి అభివర్ణించాడు. గంభీర్ తనదైన శైలిలో జట్టులో స్ఫూర్తిని నింపుతూ.. మనం ఎన్ని వందల ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచామన్నది ఎవరూ గుర్తుంచుకోరని, కానీ ఈ వరల్డ్ కప్ ట్రోఫీ మాత్రం అభిమానుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మన ముందున్న ఈ ట్రోఫీ కంటే మరేదీ ముఖ్యం కాదు" అంటూ గంభీర్ చెప్పిన మాటలు ఆటగాళ్లలో ఎంతో జోష్ నింపాయని సూర్య పేర్కొన్నాడు."టోర్నీ మొదట్లో గంభీర్‌ను నవ్వించడం మాకు సాధ్యం కాలేదు. టీమిండియా ఫర్ఫామెన్స్‌కు ఫిదా అయ్యారు. ముఖ్యంగా టీ20ల్లో 250, 256 వంటి భారీ స్కోర్లను నమోదు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. అద్భుతంగా ఛేజింగ్ చేస్తున్న తీరును చూసి గంభీర్ ఎంతో మురిసిపోయారు. ఫైనల్ గెలిచిన తర్వాత ఆయన ముఖంలో మునుపెన్నడూ లేని చిరున–వ్వు కనిపించింది. చివరకు కోచ్ గంభీర్‌ను నవ్వించాం." అని సూర్య తెలిపాడు. బ్యాక్–టు–బ్యాక్ టీ20 ప్రపంచకప్ టైటిల్స్ సాధించడం వెనకున్న అసలైన వ్యూహాన్ని కెప్టెన్ వెల్లడించాడు. ఈ టోర్నీ భారత్‌లోనే జరుగుతుందని తమకు ముందే తెలుసన్నాడు. అందుకే పరిస్థితులకు తగ్గట్టుగా వ్యూహాలను సిద్ధం చేసుకున్నట్లు స్పష్టం చేశాడు. జట్టులో అందరూ చాలా బాగా అర్థం చేసుకుని, ఒకరిపై ఒకరు శ్రద్ధ వహిస్తూ గెలుపునకు తీసుకెళ్లారన్నాడు. జట్టుకు ఏది అవసరమో దాని గురించి ఆలోచిస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆడారని కొనియాడాడు.



# ఫుట్‌బాల్ వరల్డ్ కప్ 2026లో పాల్గొనం



ప్రస్తుతం అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీని ప్రభావం క్రీడా ప్రపంచంపై కూడా పడింది. ఇప్పటికే క్రికెట్‌కు సంబంధించి పలు సిరీస్‌లు రద్దయ్యాయి. తాజాగా ఇరాన్ ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికాలో జరగబోయే పు–రుషుల ఫుట్‌బాల్ ప్రపంచకప్2026లో పాల్గొనబోమని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు ఉమ్మడిగా ఈ జూన్, జులైల్లో ఈవెంట్‌కు ఆతిథ్యమివ్వనున్నాయి.ప్రస్తుతం తమ దేశం మీదపడి దాడులు చేస్తున్న అమెరికా... అక్కడికెళ్లే తమ ఆటగాళ్లకు హాని చేసే అవకాశం ఉందని ఇరాన్ ఆరోపించింది. తమపై అత్యంత క్రూరంగా అమెరికా ప్రవర్తిస్తోందని, గడిచిన ఎనిమిది, తొమ్మిది నెలల్లోనే రెండోసారి తమపై యుద్ధం చేస్తోందని ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమపై దాడి చేసి వేల సంఖ్యలో ప్రజల ఉసురు తీస్తోందని, ఇలాంటి దేశానికి వెళ్లి తాము ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడే పరిస్థితి ఉంటుందా? అని ఇరాన్ ప్రశ్నించింది.అమెరికాలో ప్రపంచ కప్ ఆడే ప్రసక్తే లేదని ఇరాన్ క్రీడల మంత్రి అహ్మద్ దొన్యమలి ఓ టీవీ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. దీంతో అధికారికంగా అమెరికా ఆతిథ్యమిచ్చే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను ఇరాన్ బహిష్కరించనుందని స్పష్టమైంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ ప్రపంచ కప్2026లో ఇరాన్ బహిష్కరణ వాఖ్యల్ని బేఖాతరు చేస్తూ తేలిగ్గా కొట్టి పారేశారు.

# బిజినెస్


## గ్యాస్ సిలిండర్ ధరలు



గత కొద్ది రోజులుగా గ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు భారీ షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ ఉత్పత్తుల ధరల ప్రభావంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్ (LPG) సిలిండర్ రేట్లను పెంచుతూ వస్తున్నాయి. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర పైపైకి ఎగబాకుతుంది.


కొన్ని నగరాల్లో ధరలు
హైదరాబాద్: రూ. 965
వరంగల్: రూ. 984
విశాఖపట్నం: రూ.921
విజయవాడ: రూ. 937.50
గుంటూరు: రూ. 937.50

## భారీ నష్టాల్లో సూచీలు...



దేశీయ మార్కెట్‌ను యుద్ధ భయం వెంటాడుతోంది. గురువారం నష్టాలతో ప్రారంభమైన సూచీలు.. అదే ఒరవడి కొనసాగిస్తోంది. త్వరలో పశ్చిమాసియా యుద్ధం ముగుస్తుందని ట్రంప్ ప్రకటించడంతో మంగళవారం కాస్త మార్కెట్ పుంజుకుంది. అదే జోష్ కొనసాగుతుందని అంతా భావిచారు కానీ.. బుధవారం మాత్రం నష్టాల్లో ట్రేడ్ అయింది. మరోసారి చమురు ధరలు పెరగడంతో గురువారం మార్కెట్ అల్లకల్లోలం అయింది. ప్రస్తుతం సెన్సెక్స్ 816 పాయింట్లు నష్టపోయి 76,047 దగ్గర కొనసాగుతుండగా.. నిఫ్టీ 241 పాయింట్లు నష్టపోయి 23,625 దగ్గర కొనసాగుతోంది.నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఎం అండ్ ఎం, టైటాన్ కంపెనీ, బజాజ్ ఆటో అత్యధికంగా నష్టపోగా.. రిలయ–న్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభపడ్డాయి. ఆటో, మీడియా, రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఒక్కొక్కటి 2 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 1.5 శాతం తగ్గాయి.ముడి చమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ రాజకీయ అనిశ్చితులు, నిరంతర ఎఫ్ఐఐ అమ్మకాల మధ్య భారత షేర్ మార్కెట్ తీవ్రంగా పడిపోయింది. హోర్ముజ్ జలసంధి, ఇరాకీ జలాల్లో అదనపు నౌకలు ఢీకొన్నాయని వచ్చిన నివేదికల తర్వాత చమురు ధరలు పెరిగాయి. ప్రస్తుతం సరఫరా అంతరాయాల భయాలను పెంచుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఆందోళనలను రేకెత్తిస్తోంది. అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లో ముగిశాయి.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



హమ్మయ్య.. యుద్ధం వేళ మగువలకు గుడ్‌న్యూస్ అందింది. గురువారం బంగారం ధరలు దిగొచ్చాయి. చమురు, గ్యాస్ సంక్షోభం కారణంగా అన్ని ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో బంగారం, వెండి ధరలు కూడా పెరిగిపోవచ్చని అంతా భావించారు. కానీ అందుకు భిన్నంగా దిగొస్తున్నాయి. ఈరోజు తులం గోల్డ్ ధరపై రూ.1,090 తగ్గగా.. కిలో వెండిపై రూ.10, 000 తగ్గింది.తులం గోల్డ్‌పై రూ.1,090 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,62,220 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,000 తగ్గడంతో రూ.1,48,700 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.810 తగ్గడంతో రూ.1,21,670 దగ్గర ట్రేడ్ అవుతోంది.ఈరోజు సిల్వర్ ధర భారీ ఊరట కలిగించింది. ఈరోజు కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.2,80, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,90,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో కిలో వెండి రూ.2,80, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు




గత కొన్ని రోజులుగా అమెరికా– ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. దీంతో చాలావరకు గల్ఫ్ దేశాల పై యుద్ధ ప్రభావం పడింది. కేంద్ర ప్రభుత్వం ఈ పరిణామాలతో డీజిల్, పెట్రోల్ ధరలను పెంచవచ్చనే ఊహాగానాలకు వినపడుతున్నాయి. అటు పశ్చిమ ఆసియాలో ఘర్షణలు ఎక్కువ కావడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం దీనికి మరింత బలాన్ని చేకూర్చినట్టయ్యింది. ఇక ఈ పరిణామాల మధ్య ఈ పరిణామాల మధ్య వివిధ నగరాల్లో పెట్రోల్ రేట్లు ఇలా ఉన్నాయి.

**హైదరాబాద్**
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107.50
లీటర్ డీజిల్ ధర: రూ. 95.70

**వరంగల్**
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107.05
లీటర్ డీజిల్ ధర: రూ. 95.90

**విశాఖపట్నం**
లీటర్ పెట్రోల్ ధర: రూ. 108.35
లీటర్ డీజిల్ ధర: రూ. 96.22

**విజయవాడ**
లీటర్ పెట్రోల్ ధర: రూ. 109.79
లీటర్ డీజిల్ ధర: రూ. 97.22

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి...



పశ్చిమాసియా లో ఉద్రిక్తతల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ఫారెక్స్ మార్కెట్ ప్రారంభం నుండే ఒత్తిడికి లోనైన రూపాయి, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఏకంగా రూ.92.35 వద్దకు చేరుకుని రికార్డు స్థాయి పతనాన్ని నమోదు చేసింది.

**చమురు సంక్షోభం సెగ..**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న చమురు సంక్షోభం రూపాయి పతనానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతుండటంతో, భారత్ తన దిగుమతుల కోసం భారీగా డాలర్లను వెచ్చించాల్సి వస్తోంది. దీనివల్ల డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి విలువ భారీగా క్షీణించింది. చమురుతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, ఇతర దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు గణనీయంగా పెరగనున్నాయి. మరోవైపు రూపాయి బలహీనపడటంతో రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ తాజా పరిణామం సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టనుంది.

## ఏకంగా 5 శాతం షేర్లు పతనం



దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కొరత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ దెబ్బతో ఫుడ్ డెలివరీ దిగ్గజాలైన జోమాటో , స్విగ్గీ షేర్లు ఇవాళ ట్రేడింగ్‌లో భారీ నష్టాలను చవిచూశాయి. గ్యాస్ కొరత వల్ల రెస్టారెంట్లు మూతపడే ప్రమాదం ఉందన్న ఆందోళనలు ఇన్వెస్టర్లలో పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మార్కెట్ ఫస్ట్ సెషన్‌లో జోమాటో పెరెంట్ కంపెనీ ఎటర్నల్ షేరు, స్విగ్గీ షేర్లు 5 శాతం మేర క్షీణించాయి. వాణిజ్య గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రెస్టారెంట్లు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సూచప్రాయంగావెల్లడించాయి. అయితే, ఈ పరిణామం నేరుగా ఫుడ్ డెలివరీ యాప్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది.కాగా, పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన రవాణా నిలిచిపోయింది. దీంతో దేశంలో ఎల్‌పీజీ కొరత తలెత్తింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అత్యావశ్యక వస్తువుల చట్టం కింద ఎల్‌పీజీ, సీఎన్‌జీ సరఫరాకు ప్రాధాన్యతను ఇస్తోంది. ఈ పరిస్థితి ఇంకొన్నాళ్లు ఇలానే కొనసాగితే.. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ బిజినెస్ పూర్తిగా కుప్పకూలే అవకాశం ఉంది బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.




# పవన్,రణవీర్ ఆదుకుంటారా?

ప్రస్తుతం టాలీవుడ్ లో స్తబ్ధత కనిపిస్తోంది. కొత్త సినిమాల రాక తక్కువగా ఉండటంతో థియేటర్లలో ఉన్న చిత్రాలే రన్‌ను కొనసాగిస్తూ బాక్సాఫీస్ వద్ద నెట్టుకొస్తున్నాయి. అయితే, ఈ వేసవి వేడికి తోడుగా సినిమా థియేటర్లలో సెగలు పుట్టించేందుకు ఇద్దరు భారీ స్టార్లు సిద్ధమయ్యారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది కానుకగా మార్చి 19న రెండు క్రేజీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద తలపడనున్నాయి.

వాటిలో మెగా అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్లు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేశాయి. 'గబ్బర్ సింగ్' తర్వాత మళ్ళీ అదే స్థాయిలో పోలీస్ ఆఫీసర్‌గా పవన్ కళ్యాణ్ తన మ్యానరిజమ్స్‌తో థియేటర్లను హోరెత్తించడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ హీరోగా రూపొందిన 'ధురంధర్ 2' కూడా అదే రోజున (మార్చి 19) ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ప్యాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, గ్రాండ్ మేకింగ్ వాల్యూస్‌తో వస్తున్న ఈ సినిమా 'ఉస్తాద్'కు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది. ఒకే రోజున అటు టాలీవుడ్ నుంచి ఒక భారీ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్, ఇటు బాలీవుడ్ నుంచి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా విడుదల కానుండటంతో ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఉగాది సెలవుల అడ్వాంటేజ్‌ను ఏ సినిమా ఎంతవరకు క్యాష్ చేసుకుంటుందో చూడాలి.

మరి ఈ క్రేజీ క్లాష్‌లో 'ఉస్తాద్' తన పవర్ చూపిస్తాడా లేక 'ధురంధర్' సెన్సేషన్ క్రియేట్ చేస్తాడా అనేది తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే!



# 4 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి..

ఒకప్పటి స్టార్ హీరోయిన్ హన్సికా మొత్వాని 4 ఏళ్ల వివాహ బంధానికి తెరదించింది. తన భర్త నుంచి విడాకులు తీసుకుంది. 15 ఏళ్లకే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన హన్సికా, తన గ్లామర్‌తో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో అనేక సినిమాల్లో నటించింది. ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలతో జత కట్టింది. తమిళ ఇండస్ట్రీలో వరస ఆఫర్లతో బిజీగా ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకుంది.తన చిన్ననాటి స్నేహితుడు సోహైల్‌తో ప్రేమలో పడింది. ఆ తర్వాత 2022లో పెళ్లి చేసుకుంది. సోహైల్‌కు అప్పటికే రింకీ బజాన్ అనే యువతిని పెళ్లాడాడు. ఆ పెళ్లికి హన్సికా కూడా వెళ్లింది. కొంత కాలానే వారిద్దరు విడిపోవడంతో, సోహైల్‌కు హన్సికా దగ్గరైంది. కొన్నాళ్లు డేటింగ్ చేసిన తర్వాత, సోహైల్‌ను పెళ్లాడుతున్నట్లు ప్రకటించింది. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. అయితే, గతేడాది నుంచి సోహైల్ హన్సికాలు విడిపోతారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీరిద్దరికి విడాకులు మంజూరయ్యాయి.




# సెగలు పుట్టిస్తున్న నోరా..

కన్నడ యాక్షన్ స్టార్ ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కెడీ - ది డెవిల్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. దర్శకుడు ప్రేమ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, తాజాగా చిత్రబృందం ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ సెన్సేషన్ నోరా ఫతేహి ఒక ప్రత్యేక గీతంలో మెరవబోతోంది. దీనికి సంబంధించి విడుదల చేసిన పోస్టర్‌లో నోరా ఎరుపు రంగు దుస్తుల్లో 'మిర్చి'లాంటి ఘాటు అందాలతో కనిపిస్తూ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోంది. ఈ ప్రత్యేక గీతం 'సర్సె.. నిన్నా సిరాగే సర్సే' మార్చి 14వ తేదీ సాయంత్రం 5:05 గంటలకు విడుదల కానుంది. నోరా డ్యాన్స్, ధ్రువ సర్జా మాస్ స్టెప్పులతో ఈ పాట థియేటర్లలో రచ్చ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



# వేసవి బరిలో 'గోట్'..

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్' . దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకత్వం వహిస్తుండగా.. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోన్న ఈ చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. నిర్మాత మాట్లాడుతూ.. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో ఉంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉందని అన్నారు.

# సాయి పల్లవి బాలీవుడ్ డెబ్యూ..

మెగా వారసుడు వరుణ్ తేజ్ ముకుంద, కంచెతో ప్రూవ్ చేసుకున్నప్పటికీ పూరీ జగన్నాథ్ లోఫర్, మిస్టర్స్ భారీ డిజాస్టర్స్ వరుణ్ తేజ్ కెరీర్‌పై ఎఫెక్ట్ చూపాయి. ఆ తర్వాత వచ్చిన ఫిదాతో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు వరుణ్. సోలో హీరోగా అతడి కెరీర్‌లోనే హయ్యెస్ట్ గ్రాసర్ ఫిల్మ్‌గా మారింది ఫిదా. ఫిదాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి వరుణ్ తేజ్‌తో పాటు తను కూడా భారీ కమర్షియల్ సక్సెస్ అందుకుంది సాయి పల్లవి.అక్కినేని నట వారసుడు నాగ చైతన్యకు సెకండ్ ఇన్నింగ్స్‌లా మారిన ఫిల్మ్ తండేల్. గత ఏడాది రిలీజైన ఈ ఫిల్మ్ 100 కోట్లు కలెక్ట్ చేసి చైతూ కెరీర్‌లోనే హయ్యెస్ట్ గ్రాసర్ ఫిల్మ్‌గా అవతరించింది. ఈ సినిమాకు ముందుకు హ్యాట్రిక్ డిజాస్టర్స్ టేస్ట్ చేశాడు ఈ అక్కినేని వారసుడు. ఇందులో బుజ్జితల్లిగా సాయి పల్లవికి నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. గతంలో ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన లవ్ స్టోరీ కూడా కమర్షియల్ హిట్. లవ్ టుడే రీమేక్‌గా వచ్చిన లవ్యాపాతో బోల్తా పడ్డ అమీర్ ఖాన్ సన్ జునైద్ ఖాన్.. మళ్లీ రీమేక్ మూవీతోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ ఫ్లాప్ హీరోకి ఏక్ దిన్‌తో లైఫ్ ఇచ్చేందుకు రెడీ అయ్యింది సాయి పల్లవి. మూడేళ్ల క్రితం షూట్ ప్రారంభమైన ఈ సినిమాను.. వన్ లవ్ అండ్ వన్ చాన్స్ అంటూ లవ్ స్టోరీగా తీసుకురాబోతున్నారు మేకర్స్. అమరన్ షూటింగ్ .. ఈ మూవీ పార్లల్‌గా వర్క్ చేసినట్లు పల్లవి హెయిర్ స్టైల్ చెప్పకనే చెబుతోంది. డబ్బింగ్ విషయంలో మరొకరి ఛాన్స్ ఇవ్వని మేడమ్.. హిందీలోనూ తనే డబ్బింగ్ చెప్పుకుంది. భారీ రెమ్యునరేషన్ ఆఫర్ చేస్తున్నా కాదని.. కథ, ఆ కథలో తన పాత్రకు



వెయిటేజ్ ఉంటేనే సినిమాలు చేస్తూ తనకంటూ సెపరేట్ ఐడెంటిటీనీ క్రియేట్ చేసుకుంది సాయి పల్లవి. కానీ జునైద్ ఖాన్ లాంటి ఫ్లాప్ హీరోతో జోడీ కట్టడమంటే ఆమె కెరీర్ రిస్క్‌లో పడినట్లే. అందులోనూ బాలీవుడ్ ఎంట్రీలో. ఈ మూవీ హిట్టైతే ఓకే కానీ.. తేడా కొడితే.. అత్యంత భారీ బడ్జెట్ చిత్రం రామాయణపై ఇంపాక్ట్ క్రియేట్ చేసే ఛాన్స్ ఉంది. మరీ బాలీవుడ్ ఆడియన్స్‌ను మీరాగా మెప్పిస్తుందో..? సీతగా మెస్మరైజ్ చేస్తుందో..? జునైద్ ఖాన్‌కు బ్రేక్ ఇస్తుందో చూడాలి.




# విశ్వంభర డబుల్ షాక్..

అప్పుడెప్పుడో మొదలు పెట్టిన మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' సినిమాను ఇంకా చెక్కుతునే ఉన్నారు. దీని తర్వాత చిరు చేసిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా రిలీజైపోయింది, బ్లాక్ బస్టర్ అయిపోయింది. ఈ సినిమా వచ్చి నెలలు గడుస్తున్నా.. ఇంకా విశ్వంభర నుంచి ఎలాంటి అప్డేట్ రావడం లేదు. నిజానికి, గతేడాదిలోనే ఈ సినిమా థియేటర్లలోకి రావాల్సింది. కానీ, విఎఫ్ఎక్స్ కారణంగా వాయిదా పడుతు వస్తోంది. పర్ఫెక్ట్ అవుట్ పుట్ కోసం గట్టిగా వర్క్ చేస్తున్నారు మేకర్స్. ఇప్పటి వరకు వచ్చిన అవుట్ పుట్ పట్ల చిత్ర యూనిట్‌తో పాటు.. మెగాస్టార్ కూడా సంతృప్తిగా ఉన్నట్టుగా సమాచారం.అన్ని అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూన్ లేదా జులైలో ఈ సినిమా రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మెగాస్టార్ కెరీర్లోనే హైయెస్ట్ బడ్జెట్ ఖర్చు చేస్తున్నట్టుగా మొదటి నుంచి ప్రచారంలో ఉంది. బడ్జెట్ 200 నుంచి 250 కోట్ల వరకు ఉంటుందనే టాక్ ఉంది. కానీ, ఇప్పుడు ఇది డబుల్ అయినట్టుగా తెలిసింది. ఏకంగా 400 కోట్లు అని.. సినిమాటోగ్రాఫర్ చోటా కే. నాయుడు చెప్పడం విశేషం. విశ్వంభర గురించి ఓ మూవీ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. విశ్వంభర' కోసం తల ఒంచుకుని పనిచేస్తున్నాము. ఎందుకంటే, 'విశ్వంభర'లో చాలా సీజీ వర్క్ ఉంది. అక్కడ నా ఇగో చూపిస్తే వర్కౌట్ అవ్వదు! సీజీ వర్క్ బాగుండాలి. ఎందుకంటే, ఆ మూవీ వెనక రూ.400 కోట్లు ఉంది. అందుకే చాలా టైమ్ తీసుకుంటున్నాం. ఇది ది బెస్ట్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పుకొచ్చారు. ఆయన చెప్పిన దాని ప్రకారం.. విశ్వంభర బడ్జెట్ డబుల్ అయిందనే చెప్పాలి.



# అనుష్క ఏం చేస్తుంది..

టాలీవుడ్ లో ఒకప్పుడు వెలిగిపోయిన స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి కెరీర్ ఇప్పుడు సందిగ్ధంలో పడినట్లు కనిపిస్తోంది. గతేడాది విడుదలైన ఆమె భారీ ఆశలు పెట్టుకున్న చిత్రం 'ఘాటీ' బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. దాదాపు రూ. 45 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా, కనీసం పది కోట్ల వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. దీంతో ఈ 'బొమ్మాళీ' కెరీర్ ముగిసినట్టేనా అన్న విశ్లేషణలు మొదలయ్యాయి. 'ఘాటీ' వచ్చి ఏడు నెలలు దాటినా, ఇప్పటివరకు ఆమె మరో ప్రాజెక్ట్ పై సంతకం చేయలేదు. సాధారణంగా అనుష్క సినిమా అంటే మినిమం గ్యారెంటీ అనే నమ్మకం ఉండేది. కానీ 'ఘాటీ' ఫలితం తర్వాత ఆమెతో లేడీ ఓరియెంటెడ్ సినిమాలు తీయడం భారీ రిస్క్ అని నిర్మాతలు భావిస్తున్నారు. అందుకే ఆమెకు కొత్త ఆఫర్లు ఇవ్వడానికి మేకర్స్ వెనకాడుతున్నట్లు సమాచారం.ఒకప్పుడు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున వంటి సీనియర్ హీరోలకు అనుష్కనే ఫస్ట్ ఛాయిస్. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. నయనతార వంటి స్టార్ హీరోయిన్లు ఇప్పటికీ సీనియర్ హీరోల సరసన వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. అయితే అనుష్క విషయంలో మాత్రం సీనియర్ హీరోలు కూడా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ఆమెకు సరైన జోడీ కుదరకపోవడం కూడా ఒక కారణం కావొచ్చు. 'సైజ్ జీరో' సినిమా కోసం పెరిగిన బరువు ఇప్పటికీ అనుష్క కెరీర్ ను వెంటాడుతోంది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా ఆమె పాత రూపానికి రాలేకపోయారు. వెయిట్ తగ్గకపోవడం వల్ల గ్లామర్ పాత్రలకు ఆమె దూరం కావాల్సి వచ్చింది. రెండు, మూడేళ్లకు ఒక సినిమా చేస్తూ ప్రేక్షకుల ముందుకు వస్తున్న అనుష్క, ఈ సుదీర్ఘ గ్యాప్ వల్ల క్రేజ్ కోల్పోతున్నారా అన్న అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం అనుష్క చేతిలో 'కతనార్' అనే ఒక మలయాళ పీరియడ్ సినిమా మాత్రమే ఉంది. తెలుగులో ఆమె నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటనే దానిపై క్లారిటీ లేదు. మరి 'జెజమ్మ'గా ప్రేక్షకులను అలరించిన అనుష్క, మళ్ళీ ఒక పవర్ ఫుల్ రోల్ తో కంబ్యాక్ ఇచ్చి విమర్శకుల నోళ్లు మూయిస్తుందా? లేక ఇలాగే సైలెంట్ అయిపోతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# నాని నేపథ్యం ఇదే!

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతానికి 'ది పారడైజ్' అనే సినిమా రూపొందుతోంది. ఈ సినిమాను ఒక పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ సినిమాగా రూపొందిస్తున్నారు మేకర్స్. నాని కెరీర్‌లోనే మొట్టమొదటిసారిగా, ఎప్పుడూ ఊహించని విధంగా ఈ సినిమాలో ఒక రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగా వర్కవుట్ అయింది, ప్రేక్షకులలో అంచనాలు రేకెత్తించింది.ఇక తాజాగా రిలీజ్ అయిన 'ఆయా షేర్' సాంగ్ బాగా ప్రేక్షకులలోకి వెళ్ళింది. ముఖ్యంగా సాంగ్ భిన్నంగా ఉండడంతో, ఈ సాంగ్ వినేందుకు శ్రోతలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక తాజాగా ఈ సాంగ్ రాసిన లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ మీడియాతో ఈ సాంగ్ విశేషాలు పంచుకున్నారు. అయితే ఈ విశేషాలు పంచుకుంటున్న క్రమంలో ఆయన తెలిసి అన్నారో లేక తెలియక అన్నారో తెలియదు కానీ, ఈ సినిమాలో నాని నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. నిజానికి ఈ సినిమాలో నాని ఒక వేశ్యా వాటికలో ఉంటాడని ముందు నుంచి ప్రచారం జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు నాని తెగ పేరును పొరపాటున కాసర్ల శ్యామ్ సంబోధించారు. ఈ తెగ 'సవారి తెగ' అని కాసర్ల శ్యామ్ చెప్పుకొచ్చారు. ఈ సాంగ్ చేయడం తనకు చాలా అదృష్టమని, 'దసరా' తర్వాత తనకు ఈ సినిమా కూడా అంత పేరు తెచ్చే సినిమా అవుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.




Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229